VOICE OF DEMOCRACY
తెలుగు దినపత్రిక

సంపుటి :18 సంచిక :217 ఖమ్మం, తెలంగాణ ఆదివారం 13.09.2026 పేజీలు :12, వెల : 2/-

Circulating to : Hyderabad, Khammam, Warangal, Nalgonda, Karimnagar, Adilabad, Medak and Mahabubnagar



నేడు ఆఫ్ఘనిస్తాన్‌తో టీమిండియా టీ20 11



# 'ఢిల్లీ డిక్లరేషన్'కు ఆమోదముద్ర

## బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం

- డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ
- పహల్గామ్ దాడిని ఖండిస్తూ బ్రిక్స్ ప్రకటన
- ప్రధాని నరేంద్ర మోదీ దౌత్య విజయం
- భారత్ ఆకాంక్షలకు రష్యా, చైనా మద్దతు
- ఘనంగా ప్రారంభమైన బ్రిక్స్ సమావేశాలు

భారత రాజధాని న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపం వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. సమావేశంలో న్యూ ఢిల్లీ డిక్లరేషన్ 2026 కు బ్రిక్స్ కూటమిలోని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన భారత్ కు ఇది అతిపెద్ద దౌత్య విజయం అని చెప్పొచ్చు. భారత్ న్యూ ఢిల్లీ డిక్లరేషన్ కు కూటమిలోని ఏ దేశం కూడా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం. ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. భౌగోళిక రాజకీయ అంశాలపై సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ న్యూ ఢిల్లీ డిక్లరేషన్ కు ఏకాభిప్రాయం లభించడం భారత్ కు అతిపెద్ద దౌత్య విజయంగా నిలుస్తుందని అన్నారు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 : అంతర్జాతీయ విధానాలు, ఆర్థిక సహకారం, శాంతిభద్రతలపై సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ నిర్ణయం చాటిచెబుతోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని సూచించారు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేందుకే ప్రయత్నిస్తామని ప్రధాని తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. అధికారాలు, విశేషాధికారాలు ఉన్న అగ్ర దేశాల వ్యవస్థను రాబోయే 20 ఏళ్లలో ఒక భాగస్వామ్య వేదికగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాల కోసం ఒక సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) సృష్టించగలమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను, అంగీకరించిన అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి 'బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కష్టకాలంలో ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలకు ఈ కూటమి ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన కోరారు. ఇక రెండు రోజుల పాటు జరిగే ఈ 18వ బ్రిక్స్ సమావేశంలో భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా సహా మొత్తం 21 దేశాలు పాల్గొన్నాయి. అయితే విబేధాలు పక్కన పెట్టి మరీ ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాలు న్యూ ఢిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం

-మిగతా 2 లో..



## భారత్, చైనా కలిసి నడవాలి

పరస్పరం సహకరించుకోవాలి

- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వెల్లడి
- నిర్మాణాత్మక చర్చలకు మేం సిద్ధం
- ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- సరిహద్దు వివాదంపై ఇరువురు చర్చ

03

## భూభారతి ఆషామాషీగా తీసుకురాలేదు

ధరణి పోర్టల్‌తో వేలాది ఎకరాలు చెర

- నిషేధిత భూముల జాబితా కొత్తది కాదు
- భూములను కొల్లగొట్టకూడదనే చట్టం
- ధరణిలో 23 వేల ఎకరాల అక్రమాలు
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి
- 22ఏపై అసెంబ్లీలో వాడీవేడీగా చర్చ
- ఈనెల 16కు శాసనసభ వాయిదా



హైదారాబాద్, సెప్టెంబర్ 12 : తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు భూముల వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల జాబితా అంశం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. 22ఏకారణంగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, భూముల రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే

-మిగతా 2 లో..



## రాష్ట్రవ్యాప్తంగా వారం పాటు వర్షాలు

హైదారాబాద్, సెప్టెంబర్ 12 : తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం

-మిగతా 2 లో..

## దసరాకు కొత్త పింఛన్లు

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

- కొత్తగా 2.50 లక్షల నూతన పింఛన్లు
- ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ

తెలంగాణలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నవారికి శుభవార్త. కొత్త పింఛన్ల పంపిణీకి రేవంత్ సర్కార్ ముహూర్తం ఖారారు చేసింది. దసరా కానుకగా కొత్త పింఛన్లను అందించనుంది. కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల నూతన పింఛన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది.



హైదారాబాద్, సెప్టెంబర్ 12 : కొత్త పింఛన్లకు లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా.. వీరిలో అసలైన అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి అధికారులు నేరుగా వెళ్లనున్నారు. వారికి నిజంగా అర్హత ఉందా.. లేదా అనే వివరాలు పరిశీలించనున్నారు. ఈ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా

-మిగతా 2 లో..



మెట్రో ప్రయాణికులకు

## శుభవార్త

600 కోట్ల వ్యయంతో కొత్త రైళ్ల కొనుగోలు

రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ నిర్ణయం 02

## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద ఏర్పాట్లు

గణేశ్ ఉత్సవాలపై రేవంత్ రెడ్డి సమీక్ష

హైదారాబాద్, సెప్టెంబర్ 12 : వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజా ప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని

-మిగతా 2 లో..





### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 140 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 167 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 242 (కిలో) |
| స్కిన్ లెస్ | 276 (కిలో) |
| 12 గుడ్ల రిటైల్ ధర | ₹64 |



## భారీగా పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

కొత్తగా 1,010 సీట్లు అందుబాటులోకి

10,450కి చేరిన మొత్తం సీట్ల సంఖ్య

హైదారాబాద్, సెప్టెంబర్ 12 : తెలంగాణ వైద్య విద్యలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో కొత్తగా 1,010 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో 2026-27 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని 66 మెడికల్ కాలేజీల్లో

-మిగతా 2 లో..

## బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

తెలంగాణ భవన్‌లో 'నమూనా అసెంబ్లీ' నిర్వహణ

- కొండా సురేఖ తొలగింపుపై తలసాని తీవ్ర సెటైర్లు
- సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగానూ వ్యంగ్యాస్త్రాలు
- 100 రోజుల హామీల అమలుపైనా చురకలు

హైదారాబాద్, సెప్టెంబర్ 12 : కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ,

-మిగతా 2 లో..




## 2022 నాటి ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు

నిరుద్యోగులకు టీజీపీఎస్సీ షాక్..

త్వరలోనే కొత్త నోటిఫికేషన్ విడుదల

హైదారాబాద్, సెప్టెంబర్ 12 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ( టీజీపీఎస్సీ ) బిగ్ అలర్ట్ ఇచ్చింది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి సంబంధించి 2022లో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. మొత్తం 544 ఖాళీల భర్తీకి ఇచ్చిన ఈ నోటిఫికేషన్ ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు కమిషన్

-మిగతా 2 లో..

## ‘ఢిల్లీ డిక్లరేషన్’కు ఆమోదముద్ర

(మొదటిపేజీ తరువాయి)

తెలపడం కీలకంగా మారింది. న్యూ ఢిల్లీ డిక్లరేషన్ లోని కీలక విషయాలు చూస్తే.. ప్రపంచ వాణిజ్య సంస్థల నిబంధనలకు విరుద్ధంగా, వాణిజ్యాన్ని దెబ్బతీసే విధంగా ఏకపక్ష సుంకాలు పెరగడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి ఏకపక్ష చర్యలను బ్రిక్స్ దేశాలు ఖండించాయి. అలాగే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యుద్ధాలు, ఘర్షణలను శాంతి యుతంగా, దౌత్య పరంగా మాత్రమే పరిష్కరించుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని బ్రిక్స్ కూటమి స్పష్టం చేసింది. అలాగే ప్రపంచంలో నెలకున్న సమస్యలపై వివిధ దేశాలు చూసే దృక్కోణాన్ని తాము స్వాగతిస్తున్నట్లు తెలిపాయి. దాంతోపాటు అంతర్జాతీయ సమస్యలపై శాంతి యుత చర్చలు, భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పాయి. అలాగే గతేడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది క్రిమినల్ చర్య అని ఎప్పటికీ క్షమించరానిదాని తెలిపాయి. ఈ ఘోర ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరెందరో గాయపడినట్లు వివరించాయి. ఇలాంటి ఉగ్రవాద చర్యలను అసలు ఉపేక్షించేది లేదని బ్రిక్స్ కూటమి దేశాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఎదుర్కొనేందుకు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. వీటితోపాటు మారుతున్న, వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని బ్రిక్స్ దేశాలు డిమాండ్ చేశాయి. భారత్ నేతృత్వంలో ఈ బ్రిక్స్ సదస్సు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తీర్మానించాయి. ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని దిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్?, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం దక్కాలని బ్రిక్స్ కూటమి డిమాండ్ చేసింది.వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీలలోనే ఎక్కువగా జరగాలని, సరిహద్దు చెల్లింపుల కోసం ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్ర నిధులు అరికట్టాలని, ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరి వీడాలని స్పష్టం చేసింది. అలాగే అణు కేంద్రాలపై జరుగుతున్న దాడులను, పెరుగుతున్న అణ్వస్త్ర ప్రమాదాలను ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తూ, గ్లోబల్ మిలిటరీ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం పట్ల విచారం వ్యక్తం చేసింది. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని స్పష్టం చేస్తూనే, పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని డిక్లరేషన్ సూచించింది. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటుకు బ్రిక్స్ దేశాలు తీర్మానించాయి. ఆర్థిక, సామాజిక వృద్ధిలో నిర్ణయాధికారులుగా మహిళల పాత్ర అత్యంత కీలకమని న్యూఢిల్లీ డిక్లరేషన్ గుర్తించింది.



## బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

“కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. బీసీ బిడ్డనైన నేను సీఎం అయ్యాక, ఆమెను కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?” అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించారు. “100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా” అంటూ ఎద్దేవా చేశారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టినందుకు గాను, సెప్టెంబర్ 9న కేటీఆర్ తో సహా 22 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌కు నిరసనగానే బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ వేదికపై, ప్రభుత్వం చర్చకు అనుమతించని ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.



## వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

(మొదటిపేజీ తరువాయి)

విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. “స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది” అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... “మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి” అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. “హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది” అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# భూభారతి ఆషామాషీగా తీసుకురాలేదు

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది. తాజాగా అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గణాంకాలతో బీఆర్ఎస్‌కు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 22ఏ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని, భూముల విలువలు భారీగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం పడుతోందని విమర్శించారు. ఈ ఆరోపణలకు అసెంబ్లీ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమాధానమిచ్చారు. 22ఏ కారణంగా రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రాబడి తగ్గిపోయాయన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన గణాంకాలను వెల్లడించారు. మంత్రి అసెంబ్లీకి తెలిపిన వివరాల ప్రకారం.. 2025 ఏప్రిల్, మే, జూన్, జులై, ఆగస్టు ఐదు నెలల కాలంలో రాష్ట్రంలో మొత్తం 4,90,478 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయన్నారు. అదే ఐదు నెలల కాలాన్ని 2026లో పరిశీలిస్తే 5,10,273 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయినట్లు తెలిపారు. అంటే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 19,795 డాక్యుమెంట్లు అదనంగా రిజిస్టర్ అయ్యాయని మంత్రి వివరించారు. ఇక రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయాన్ని పరిశీలించినా తగ్గుదల కనిపించలేదని మంత్రి పొంగులేటి తెలిపారు. 2025లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల్లో రూ.6,216 కోట్ల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అదే 2026లో ఐదు నెలల కాలంలో రూ.7,575 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. అంటే గత ఏడాదితో పోలిస్తే రూ.1,359 కోట్ల అదనపు ఆదాయం వచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ గణాంకాలను ప్రస్తావిస్తూ 22ఏ వల్ల రిజిస్ట్రేషన్లు, ఆదాయం తగ్గిపోయాయన్న బీఆర్ఎస్ ఆరోపణలను మంత్రి పొంగులేటి తిప్పికొట్టారు. వాస్తవ పరిస్థితిని గణాంకాలే చెబుతున్నాయని స్పష్టం చేశారు. మరోవైపు 22ఏ నిషేధిత భూముల జాబితా విషయంలో మాత్రం రాజకీయ వాదోపవాదాలు కొనసాగాయి. భూముల రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రియల్ ఎస్టేట్ రంగం, సామాన్యుల భూ హక్కులు వంటి అంశాలు ఈ వివాదంతో ముడిపడి ఉన్నాయి. దీంతో 22ఏ అంశం కేవలం రెవెన్యూ వ్యవహారంగా కాకుండా తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన రాజకీయ అంశంగా మారింది. మరోవైపు తెలంగాణ శాసనసభ సాక్షిగా రాష్ట్రంలో నెలకున్న భూ సమస్యలు, 22ఏ నిబంధనలు , ధరణి అక్రమాలపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ధరణి పోర్టల్ ను అడ్డుపెట్టుకుని గత పాలకులు లక్షలాది ఎకరాలను చెరబట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా వారి బండారం బయటపడుతుండటంతోనే సభ నుంచి తప్పించుకొని తిరుగుతున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను స్వప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబం, వాళ్ల బంధువులు మాత్రమే బాగుపడ్డారని అన్నారు. అలాగే ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణలోని దాదాపు 2.49 కోట్ల ఎకరాల భూమిని



తమ సొంత ఆస్తిగా భావించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగించిందని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి సమయాల్లో రిజిస్ట్రేషన్లు చేశారని కీలక ఆరోపణలు చేశారు. ప్రజల ఆస్తులను పరిరక్షించడమే రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. శాసనసభలో 22ఏ నిషేధిత భూముల అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ఆశామాషీగా తీసుకురాలేదని.. దాదాపు 18 రాష్ట్రాల్లోని అధికారులు అధ్యయనం చేశాక..ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాతే భూ భారతికి రూపకల్పన చేశామని స్పష్టం చేశారు. భూభారతి ఎన్ ఐసి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోనే పారదర్శకంగా నడుస్తుందని తెలిపారు. అలాగే 22ఏ నిషేధిత భూముల అంశంపై మాట్లాడుతూ.. 2023 నాటికి 22 ఏ జాబితాలో కోటి 2 లక్షల 52 వేల 690 ఎకరాలకు సంబంధించిన వివరాలను సభ ముందు ఉంచారు మంత్రి పొంగులేటి. వీటిలో అటవీ, అసైన్డ్, ఇతర ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 1995లో ఘట్కేసర్ రైల్వేస్టేషన్ భూమిని కూడా ఒకరికి రిజిస్ట్రేషన్ చేశారన్న మంత్రి పొంగులేటి, అలాంటి అక్రమాలు మళ్లీ జరగొద్దనే నిషేధిత భూముల జాబితా తెచ్చారన్నారు. మళ్లీ కేసీఆర్? హయంలో 2016లో కొత్తగా జీవో 121 జారీ చేశారని చెప్పారు. జీవో 121 తీసుకువచ్చి చాలామంది రైతులను నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వం కొత్తగా నిషేధిత జాబితాలో ఒక్క ఎకరమూ చేర్చలేదని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నిషేధిత జాబితాలో ఉండకూడని భూములు కొన్ని ఆనాటి నుంచి ఉన్నాయని పొంగులేటి వివరించారు. బీఆర్ఎస్ హయాంలోనూ అదే కాపీని అప్‌లోడ్ చేశారన్నారు. దానిని అధికారులు ప్రింట్ తీసి మరోసారి అప్‌లోడ్ చేశారని వివరించారు. ఇక్కడే పొరపాటు జరిగిందని చెప్పారు. ఇది మొదటి నుంచీ జరిగిన పొరపాటని మంత్రి అసెంబ్లీలో వెల్లడించారు. ఉమ్మడి ఏపీ హయాం నుంచి వచ్చిన జీవోల ఆధారంగానే ఆ కాపీ రూపొందిందని పొంగులేటి గుర్తు చేశారు. గతంలో కొన్ని భూములను ప్రభుత్వం విక్రయించడం, ప్లాట్లు చేసి ఇవ్వడం జరిగిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విక్రయించిన భూములను అధికారులు పొరపాటున 22ఏలో చేర్చారన్నారు. అధికారులు చేసిన పొరపాటును యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతున్నామని చెప్పారు. నిషేధిత జాబితా నుంచి గతంలోనే తొలగిస్తూ ఇచ్చిన జీవో చూపితే వెంటనే తొలగిస్తున్నామన్నారు. ఒక్కరోజులోనే మ్యుటేషన్ చేయటం వల్ల ఎన్నో అక్రమాలు జరిగాయన్న పొంగులేటి, ధరణి పోర్టల్‌లో 80 మాడ్యూల్స్ పెట్టి పేద రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని మండిపడ్డారు. ఇప్పుడు భూభారతి చట్టంలో 80 మాడ్యూల్స్‌కు బదులు కేవలం 5 మాడ్యూల్స్ పెట్టామన్నారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి మొత్తం 1,02,05,250 ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభకు వివరించారు. 22ఏలోని ప్రభుత్వ వ్యవసాయ భూములు 96,36,777 ఎకరాలు ఉన్నాయన్నారు. ప్రైవేటు వ్యవసాయ భూమి 3,73,930 ఎకరాలు ఉందని వివరించారు. వ్యవసాయేతర భూమి 1,94,543 ఎకరాలున్నట్లుగా సభలో వివరించారు. ఇవి కాకుండా ఎండోమెంట్ భూములు 5,12,792 ఎకరాలు ఉన్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ దిగిపోయేనాటికి, ఇప్పటికి నిషేధిత జాబితాలోని భూమి 47,440 ఎకరాలు తగ్గిందని పొంగులేటి తెలిపారు. 23వేల ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రజలకు ఇచ్చామన్నారు. పాత జీవోల్లోని తప్పులను గుర్తించి మరో 20వేల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించామని చెప్పారు. 22ఏ నుంచి తొలగించిన మొత్తం 47,440 ఎకరాల్లో ప్రతి ఎకరాకు లెక్కలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తొలగించిన 23వేల ఎకరాలకు లెక్కలు లేవని కమిటీ చెప్పిందని పొంగులేటి గుర్తుచేశారు. కోట్ల మంది రైతుల వివరాలను విదేశీ సంస్థ అయిన టెరాసిస్ చేతిలో పెట్టారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక, టెరాసిస్ సంస్థను తొలగించి కేంద్ర సంస్థ అయిన ఎన్ఐసీకి అప్పగించామన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 387 గ్రామాలకు నక్షలు లేవన్నారు. దాదాపు 125 ఏళ్ల తర్వాత గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టామని పొంగులేటి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన గ్రామాల్లో ఇప్పటికే భూమి మొత్తం సర్వే చేసి రైతులకు పాసుపుస్తకాలు ఇచ్చామని తెలిపారు.వచ్చే ఏడాదిన్నరలోపు రాష్ట్రవ్యాప్తంగా భూసర్వే పూర్తి చేసి రైతులకు మేలు చేస్తామని స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకొని, గత పాలకులు అర్ధరాత్రి వేళ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా గత పాలకులు భావించారని ఆక్షేపించారు. ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పులకు లక్షలాది రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పోర్టల్‌లో తప్పుల నమోదు వల్ల వందల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌కు లాక్ అనే సిస్టమ్ పెట్టి అందరి భూములపై నిఘా పెట్టారన్నారు.

## భారీగా పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 10,450కి చేరింది. దేశవ్యాప్తంగా మెడికల్ సీట్ల వివరాలతో మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు శుక్రవారం విడుదల చేసిన సీట్ మ్యాట్రిక్స్‌లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. తాజా పెంపుతో అత్యధిక ఎంబీబీఎస్ సీట్లు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఐదో స్థానానికి చేరింది. రాష్ట్రంలో ప్రస్తుతం 36 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 4,400 సీట్లు ఉన్నాయి. వీటిలో 4,290 సీట్లు గత సీట్లకు రెన్యువల్ కాగా.. కొత్తగా మరో 110 సీట్లు పెరిగాయి. మహబూబ్‌నగర్, సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 25 చొప్పున, నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్ రిమ్స్‌లో 30 చొప్పున సీట్లు పెరిగాయి. రాష్ట్రంలోని 30 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో మొత్తం 6,050 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 5,150 సీట్లు రెన్యువల్ కాగ.., కొత్తగా 900 సీట్లు చేరాయి. కొత్తగా ఏర్పాటైన రాజరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో 150 సీట్లు కేటాయించారు. మిగిలిన సీట్లు ఇప్పటికే ఉన్న పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీట్ల పెంపు ద్వారా అందుబాటులోకి వచ్చాయి. కొత్త సీట్లతో రాష్ట్రంలో వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య, సీట్ల సామర్థ్యం పెరుగుతున్న నేపథ్యంలో వైద్య విద్యను జిల్లాల స్థాయికి విస్తరించే ప్రయత్నాలకు ఇది మరింత ఊతమివ్వనుంది. ఎయిమ్స్, జిప్‌మర్ వంటి జాతీయ ప్రాధాన్యం ఉన్న సంస్థలను మినహాయిస్తే దేశవ్యాప్తంగా 836 మెడికల్ కాలేజీల్లో 1,40,214 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులో 445 ప్రభుత్వ కాలేజీల్లో 63,971 సీట్లు, 391 ప్రైవేట్ కాలేజీల్లో 76,243 సీట్లు ఉన్నాయి. కొత్త కాలేజీలు, సీట్ల పెంపు ద్వారా ఈ ఏడాది దేశవ్యాప్తంగా 13,186 సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. మరో 1,27,028 సీట్లు రెన్యువల్ అయ్యాయి. దేశంలో 15,745 సీట్లతో కర్ణాటక మొదటి స్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్ 14,400, తమిళనాడు 14,299, మహారాష్ట్ర 13,249 సీట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 40 మెడికల్ కాలేజీల్లో మొత్తం 7,615 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. మెడికల్ కాలేజీలు తమకు మంజూరైన సీట్ల మేరకే అడ్మిషన్లు ఇవ్వాలని జాతీయ వైద్య కమిషన్ స్పష్టం చేసింది. ఒక్క సీటు అదనంగా భర్తీ చేసినా ఎన్ఎంసీ చట్టం–2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అవసరమైతే క్రిమినల్ చర్యలతోపాటు జరిమానాలు విధించే అవకాశం ఉందని తెలిపింది. కౌన్సెలింగ్ కమిటీలు కూడా అనుమతించిన సీట్లకు మించి ప్రవేశాలు కల్పించకూడదని స్పష్టం చేసింది. కొత్తగా అనుమతి పొందిన లేదా సీట్లను పెంచుకున్న ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఏడు రోజుల్లోగా ఎంఏఆర్‌బీ డైరెక్టర్ పేరిట ఎలక్ట్రానిక్ బ్యాంక్ గ్యారంటీ సమర్పించాలని స్పష్టం చేసింది. దాని పరిశీలన పూర్తయిన తర్వాతే లెటర్ ఆఫ్ పర్మిషన్ జారీ చేయనున్నట్లు ఎన్ఎంసీ వెల్లడించింది.

## దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుకుంది. అనంతరం వచ్చే నెల తొలివారంలో అర్హులను ఎంపిక చేసి జాబితా సిద్ధం చేయనున్నారు. అర్హులైన వారికి దసరా నుంచి పింఛన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇందుకు అవసరమైన బడ్జెట్ కూడా కేటాయించారు. దీంతో అర్హులను ఎంపిక చేయడమే తరువాయి. ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం, సర్టిఫికేట్ల జారీలో సమస్యలు తలెత్తడంతో ఆలస్యమైంది. ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా.. సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. అయితే దివ్యాంగులు, డయాలసిస్, ఫైలేరియా, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళల అర్హతలను నిర్ధారించేందుకు పత్రాలు అవసరం. ఒంటరి మహిళలకు సంబంధించి విడాకుల డాక్యుమెంట్స్, కోర్టు ఉత్తర్వులతో పాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ధ్రువీకరణ అవసరమవుతుంది. అలాగే వితంతువులు భర్త డెత్ సర్టిఫికేట్ సమర్పించాలి. అయితే భర్త చనిపోయి ఎక్కువకాలం అయితే సర్టిఫికేట్ పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ఇక గీత, చేనేత, ఫైలిరియా, డయాలసిస్ వర్గాలకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి ధృవీకరణ పత్రాలు పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ధ్రువీకరణ పత్రాల అవసరం లేకుండానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే ఆ తర్వాత ధృవీకరణ సమయంలో పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడే పింఛన్లకు అర్హత సాధిస్తారు. అధికారులో క్షేత్రస్థాయిలో పర్యటించి కుటుంబ పరిస్థితి, ఆదాయం, ఇతర ఆధారాలను పరిశీలించనున్నారు. అనంతరం తుది జాబితా సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం 2.50 లక్షల పింఛన్లకు మాత్రమే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో అంతమంది అర్హులను మాత్రమే ప్రస్తుతం ఎంపిక చేయనున్నారు. ప్రాధాన్యత వారీగా పూర్తి అర్హతలు ఉన్నవారిని ఎంపిక చేయనున్నారు. దసరా నుంచి కొత్త ఫించన్లను అందనుడటంతో అర్హులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తుది జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నారు. ప్రభుత్వం ఆమోదించాక పింఛన్లను పంపిణీ చేయనున్నారు.

## మెట్రో ప్రయాణికులకు శుభవార్త

### 600 కోట్ల వ్యయంతో కొత్త రైళ్ల కొనుగోలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. మెట్రో రైళ్లల్లో రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం మందడుగు వేసింది. ప్రస్తుతం పీక్ సమయాల్లో మెట్రోలలో విపరీతమైన రద్దీ ఉంటుంది. కనీసం నిల్చోవడానికి కూడా స్థలం ఉండటం లేదు. ఈ సమస్యతో మెట్రో ప్రయాణికులు ఎప్పటినుంచో ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధమైంది. రద్దీని తగ్గించేందుకు కొత్త రైళ్లను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం కొత్త రైళ్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది. ఒక్కొ రైల్లో 2 వేల మంది ప్రయాణించేందుకు వీలుగా 6 కోచ్‌ల రైళ్లను ప్రవేశపెట్టనుంది.తొలి దశలో 60 కోచ్‌లను కొనుగోలు చేయనుండగా.. ఆరు కోచ్‌లతో కూడిన 10 కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకొస్తారు. ఒక్కొ రైలుకు రూ.60 కోట్ల వరకు ఖర్చు కానుంది. 60 కోచ్‌ల కొనుగోలుకు రూ.600 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా వేశారు. త్వరలోనే కొత్త రైళ్ల కోసం టెండర్లను ఆహ్వానించనున్నారు. బిడ్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వత తుది వ్యయం ఎంత అవుతుందనేది తెలియనుంది. ప్రస్తుతం ఉన్న మెట్రో రైళ్లల్లో మూడు కోచ్‌లు మాత్రమే అందుబాటులోకి ఉన్నాయి. దీంతో ఒకేసారి వెయ్యి మంది మాత్రమే ప్రయాణించడానికి వీలు కలుగుతుంది. అదే ఆరు కోచ్‌లు అందుబాటులోకి వస్తే ఒకేసారి 2 వేల మంది ప్రయాణించవచ్చు. ప్రయాణికుల సంఖ్య దాదాపు రెట్టింపు అవుతుంది. వీటి వల్ల ఒకేసారి ఎక్కువమంది ప్రయాణికులకు తమ గమ్యస్థానాలకు చేర్చవచ్చు.ఎక్కువ కోచ్‌లు కలిగిన రైళ్లు ఉండటం వల్ల ప్రయాణికుల రద్దీ కూడా తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ విపరీతంగా ఉండటం వల్ల కనీసం అడుగు వేసేందుకు కూడా ఖాళీ స్థలం ఉండటం లేదు. దీని వల్ల ఇబ్బంది పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు తర్వాతి రైలు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రస్తుతం మెట్రోలో రోజూ 4.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అయితే కొత్త మెట్రో రైళ్లు వస్తే 6 లక్షల వరకు పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అమీర్ పేట–రాయదుర్గం మార్గంలో ఎక్కువ రద్దీ ఉంటుంది. ఉదయం ఆఫీసులకు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల రాయదుర్గం స్టేషన్‌లో కొన్నిసార్లు ప్రయాణికులకు కొద్దిసేపు ఆపాల్సి వస్తోంది. రద్దీని నియంత్రించేందుకు అధికారులు ఈ ప్రయత్నం చేస్తున్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా వారం పాటు వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది.ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడ క్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్త రు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరిం చింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటు వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది.

## 2022 నాటి ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు

(మొదటిపేజీ తరువాయి)

వెబ్‌నోట్ ద్వారా వెల్లడించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2022 డిసెంబర్ 31వ తేదీన కాలేజియేట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీ కోసం బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 544 ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించారు. అయితే ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలపై కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. అన్ని పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన తర్వాత 33/2022 బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తాజాగా టీజీపీఎస్సీ ప్రకటించింది. పాత నోటిఫికేషన్ రద్దు కావడంతో ఈ పోస్టుల భర్తీకి కొత్త నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. కొత్త నోటిఫికేషన్‌ను ప్రస్తుత నిబంధనలు, రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ విధానాలకు అనుగుణంగా రూపొందించే అవకాశం ఉంది. కమిషన్ వెబ్‌నోట్ ప్రకారం.. 2022 డిసెంబర్ 31వ తేదీన జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను తక్షణమే రద్దు చేశారు. 544 ఖాళీలకు సంబంధించిన ఈ నోటిఫికేషన్ ఇక చెల్లుబాటు కాదని అభ్యర్థులు గుర్తించాలని కమిషన్ సూచించింది. పాత నోటిఫికేషన్ రద్దు కావడంతో గతంలో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్ ఆధారంగా నియామక ప్రక్రియ కొనసాగదని అభ్యర్థులు గమనించాలి. కొత్త నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అందులో పేర్కొనే పోస్టుల సంఖ్య, అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, దరఖాస్తు తేదీలు, ఎంపిక విధానం వంటి వివరాలను అభ్యర్థులు తప్పనిసరిగా పరిశీలించాలి. కొత్త నోటిఫికేషన్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ తన వెబ్‌నోట్‌లో పేర్కొంది. దీంతో డిగ్రీ కాలేజీ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు కొత్త ప్రకటన కోసం వేచి చూడాల్సి ఉంటుంది.

# శాసనసభలో క్యూర్-2026 బిల్లు

## ఇక బిల్లు ఆమోదమే తరువాయి



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** హైదరాబాద్ మహా నగరంలో వేర్వేరు సంస్థలు, వ్యవస్థలతో అస్తవ్యస్తంగా మారిన పరిపాలనను చక్కదిద్దడమే లక్ష్యంగా క్యూర్(కోర్ అర్బన్ రీజియన్)-2026 బిల్లును ప్రభుత్వం శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టింది. ఒకే నగరం, ఒకే పరిపాలన, ఒకే చట్టం నినాదంతో ఈ బిల్లు రూపుదిద్దుకుంది. జీహెచ్ఎంసీ-1955 చట్టం స్థానంలో ప్రభుత్వం ఈ క్యూర్ బిల్లు-2026ను ప్రతిపాదించింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీలకు ఈ చట్టం వర్తిస్తుంది. ఇందులో ఐదు భాగాలు, 43 చాప్టర్లు, 319 సెక్షన్లు, 9 షెడ్యూళ్లు ఉన్నాయి. సీఎం ఛైర్మన్‌గా క్యూర్ పరిధికి అత్యున్నత పరిపాలన మండలి, కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి, మరో పది రకాల కమిటీలు ఈ చట్టంలో ఉంటాయి. జీహెచ్ఎంసీ చట్టంలో మాదిరి పరిపాలనలో నగర పాలక సంస్థనే పరిమితం చేయకుండా పోలీసు, హైడ్రా, జలమండలి వంటి ఇతర శాఖలను ఇందులో భాగస్వామ్యం చేసింది. అక్రమ నిర్మాణాల కట్టడికి జరిమానా, కూల్చివేత, సీజ్ చేయడం, సౌకర్యాల నిలిపివేత అనే నాలుగు రకాల చర్యలు ఇందులో ఉంటాయి. సెక్షన్ 94 ప్రకారం అనుమతిలేని భవన నిర్మాణాలు ఉంటే ఆస్తిపన్నుపై 100 శాతం నుంచి 300 శాతం జరిమానా పడుతుంది. భవనం వినియోగాన్ని మార్చినా ఫైన్ విధిస్తారు. అనుమతి లేని భవనాలకు జీహెచ్?ఎంసీ కమిషనర్ నోటీసు ఇచ్చిన 15 రోజుల్లో చర్యలు ఉంటాయి. అనుమతిలేని భవనాన్ని యజమాని స్వయంగా కూల్చుకోవాల్సి ఉంటుంది. లేదంటే బల్దియా కూల్చి ఖర్చును ఆస్తిపన్నులో జమచేస్తుంది. ప్రజల భద్రత దృష్ట్యా మున్సిపల్ అధికారులు నోటీసు లేకుండానే భవనాన్ని సీజ్ చేసే అధికారం ఉంది. నివాసయోగ్యపత్రం లేకపోతే భవనానికి కరెంటు, తాగునీరు, మురుగునీటి కనెక్షన్లు మంజూరు చేయకూడదు. అక్రమ నిర్మాణాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, రిజిస్ట్రేషన్ల చట్టంలోని సెక్షన్ 22ఏ(1)(ఏ) కింద నిషేధిత జాబితాలో చేర్చాలని ముసాయిదా బిల్లు చెబుతోంది. ఆయా కేసుల్లో ప్రజలు బాధితులుగా మారితే జీహెచ్?ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నిర్ణయాలు, నోటీసులను 30 రోజుల్లో ప్రజలు సవాల్? చేయవచ్చు. ప్రభుత్వం క్యూర్ అప్పిలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేస్తుంది. ఛైర్‌పర్సన్, ఇద్దరి నుంచి నలుగురు పూర్తిస్థాయి సభ్యులతో సివిల్ కోర్టు అధికారాలతో ఈ అథారిటీ విధులు నిర్వహిస్తుంది. సభ్యులను ప్రభుత్వం, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శితో కూడిన సెలక్షన్ కమిటీ నియమిస్తుంది. క్యూర్ పరిధిలోని 3 కార్పొరేషన్లకు ఒకే వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా పౌర సేవలను అందించాలని అన్నిరకాల పర్మిషన్లు, పన్ను, రుసుముల చెల్లింపునకు సదుపాయం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్తులో ఇతర ప్రభుత్వ శాఖల రుసుముల చెల్లింపు సదుపాయాన్ని కూడా క్యూర్ ఆన్‌లైన్ పోర్టల్‌లో చేర్చాలన్నది ప్రతిపాదన. హైదరాబాద్?లోని అన్ని భవనాలకు ప్రాపర్టీ ఐడెంటిటీ కోడ్, అపార్ట్‌మెంట్ల విషయంలో ఫ్లాట్లకు సబ్ ఐడెంటిటీ కోడ్‌ను ఇవ్వాలన్నది బిల్లులోని ప్రతిపాదన. ఆయా గుర్తింపు సంఖ్యతో ప్రజలు తమ ఆస్తి వివరాలు, నీటి బిల్లు, దానికి సంబంధించిన పన్ను, కరెంటు బిల్లు, ఇతరత్రా ఛార్జీలను చెల్లించుకునే వెసులుబాటు కల్పిస్తారు. క్యూర్ బిల్లుపై ప్రభుత్వం ఈ ఏడాది జులై 4వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు, అభిప్రాయాలు స్వీకరించింది. ఆన్‌లైన్‌లో 4,107, ఈ-మెయిల్‌కు 400 అభ్యంతరాలు వచ్చాయి. వాటిలో 2,465 ఫిర్యాదులు ఆస్తిపన్నును పెంచొద్దనే విషయంపైనే ఉన్నాయి. ఎంఐఎం పార్టీ నుంచి 18, బీజేపీ నుంచి ఐదు, ఎంపీ రఘునందన్‌రావు వ్యక్తిగతంగా ఆరు సూచనలు ఈ బిల్లులో చేశారు. వాటిల్లో కొన్ని సూచనలను పరిగణనలోకి తీసుకొని బిల్లులో అధికారులు మార్పులు చేశారు. క్యూర్ బిల్లు హైడ్రాకు చట్టపరమైన గుర్తింపుతోపాటు పలు అదనపు అధికారాలను కూడా కల్పిస్తోంది. సొంత పోలీస్? స్టేషన్? ఏర్పాటుతో కొన్ని నేరాలపై క్రిమినల్ కేసులను నమోదు చేసే అధికారం ఉంది. అగ్నిమాపక భద్రత చర్యలపై తనిఖీల నిర్వహణ, నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌పై తనిఖీలు, ఇతరత్రా అధికారాలు హైడ్రాకు ఉంటాయి.

# సుద్దాలకు 'తెలంగాణ తెలుగు తేజం' పురస్కారం

- సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం
- ఈనెల 22న కరీంనగర్‌లో పురస్కారం ప్రదానం



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** తెలుగు సాహిత్య రంగంలో ప్రముఖ కవి, జాతీయ స్థాయి సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కింది. బుర్ర నర్సమ్మ-లింగారెడ్డి స్మారక తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కారం-2026కు ఆయనను ఎంపిక చేశారు. తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ సాహితీ సంస్థ ఏటా ప్రదానం చేస్తున్న ఈ రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఈసారి సుద్దాల అశోక్ తేజను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. పురస్కార కమిటీ ఛైర్మన్, అవార్డు వ్యవస్థాపకుడు కెప్టెన్ డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి, తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. తెలుగు భాష, సాహిత్యానికి విశేష సేవలు అందిస్తున్న వారిని గుర్తించి గౌరవించాలనే ఉద్దేశంతో తెలంగాణ తెలుగు తేజం పురస్కారాన్ని ఏటా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కవిగా, సినీ గేయ రచయితగా సుద్దాల అశోక్ తేజ తెలుగు భాషకు విశిష్టమైన సేవలు అందిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సామాజిక జీవనాన్ని ప్రతిబింబించే సాహిత్య, సినీ రచనలతో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని ఈ నెల 22వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజకు పురస్కారాన్ని అందజేయనున్నారు. తెలుగు భాషకు తెలంగాణ మట్టిబిడ్డలు అందించిన అమూల్యమైన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు పురస్కార కమిటీ ప్రతినిధులు తెలిపారు. భాషా పరిరక్షణ, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న రచయితలు, కవులు, సాహితీవేత్తలను ప్రోత్సహించడంలో భాగంగా ఈ పురస్కారాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. సుద్దాల అశోక్ తేజ తెలుగు సాహిత్యంతో పాటు సినీ గేయ రచయితగా కూడా తనదైన ముద్ర వేశారు. సామాజిక అంశాలు, తెలంగాణ జీవన విధానం, ప్రజల భావోద్వేగాలను ప్రతిబింబించే అనేక రచనలకు ఆయన కలం అందించారు. ఆయన సాహిత్య, సినీ ప్రస్థానాన్ని గుర్తిస్తూ తెలంగాణ తెలుగు తేజం పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కరీంనగర్‌లో ఈ నెల 22వ తేదీన జరగనున్న పురస్కార ప్రదానోత్సవంతో సుద్దాల అశోక్ తేజకు ఈ గౌరవం అధికారికంగా అందనుంది. ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు, భాషాభిమానులు, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది.



# ఎంత బుకాయించినా చేసిన తప్పు నుంచి తప్పించుకోలేరు

**హరీశ్‌రావు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** తాము అడిగిన ఏ ప్రశ్నకూ మంత్రి పొంగులేటి సమాధానం చెప్పలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నిషేధిత భూముల అంశంపై అసెంబ్లీలో స్పష్టత వస్తుందని అందరూ భావించారని, కానీ నిరాశే మిగిలిందని వ్యాఖ్యానించారు. తమను సస్పెండ్ చేసి.. పొంగులేటి అబద్ధాల ప్రవాహం పారించారని విమర్శించారు. తాము సభలో ఉంటే.. అవినీతి, కుంభకోణాలు బయటపెడతామన్న కారణంతోనే సస్పెండ్ చేశారన్నారు. భాజపా, బీఆర్ఎస్ ఒకటే అని చెప్పే చిల్లర ప్రయత్నం చేశారని తెలిపారు. "22ఏలో ఎన్ని ఎకరాలు పెట్టారో చెప్పాలని కోరితే పొంగులేటి నుంచి సమాధానం లేదు. 22ఏ అంశంపై ప్రశ్నించినందుకే నాపై వ్యక్తిగత దాడి చేశారు. తప్పుడు జాబితా అప్‌లోడ్ చేశామని చెప్పారు. తప్పు ఒప్పుకొని పొంగులేటి క్షమాపణలు చెబుతారని ఆశించాం. క్షమాపణ చెప్పకుండా మాపై ఎదురుదాడి చేసే ప్రయత్నం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని 22ఏ నుంచి రాత్రికి రాత్రి తొలగించారు. పేదల ఆస్తులపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. మంత్రి పొంగులేటి అబద్ధాలు, అర్ధ సత్యాలు చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలపై పొంగులేటి బుకాయించే ప్రయత్నం చేశారు. ఎంత బుకాయించినా చేసిన తప్పు నుంచి తప్పించుకోలేరు. గతంలోనే నిషేధిత జాబితాలో ఉంటే మా హయాంలో రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి? గతంలో ఉన్న సమస్య అయితే పొరపాటు జరిగిందని సారీ ఎందుకు చెప్పారు? నాదర్‌గుల్, వట్టినాగులపల్లి, ఖాజాగూడ, అబ్దుల్లాపూర్‌మెట్ భూముల అంశంపై పొంగులేటి ఎందుకు మాట్లాడలేదు? తన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు నాపై ఎదురుదాడి చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మా మామ ఎక్స్‌సర్వీస్‌మెన్ నుంచి భూమి కొన్నారు. మా మామ కొన్న భూమి ఎకరా రూ.15 కోట్లు అన్నారు. ఎకరా రూ.15 కోట్లు కదా.. మాకు రూ.50 లక్షలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోండి. తప్పులు జరిగి ఉంటే.. మూడేళ్లుగా ఎందుకు చర్యలు తీసుకోలేదు. కాంగ్రెస్ అవినీతి బయటపెట్టినందుకే.. నాపై బురద జల్లుతున్నారు. భూభారతిలో రెండు తప్పులు జరిగినట్లు పొంగులేటి ఒప్పుకొన్నారు. భూభారతి అంత సీల్ ప్రూఫ్ ఉంటే సమస్య ఎలా వచ్చింది? అసైన్డ్ పట్టా భూములు తెలియకుండానే రిజిస్ట్రేషన్ అవుతున్నట్లు అంగీకరించారు. యజమానులకు తెలియకుండా 9,200 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయినట్లు మా దగ్గర సమాచారం ఉంది. నిషేధిత జాబితా నుంచి ఎప్పటిలోగా తొలగిస్తారన్నది ప్రజలకు చెప్పాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా హైదరాబాద్

- హైదరాబాద్ వైభవాన్ని కాపాడుతాం
- సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం
- శాసన సభలో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు-2026ను మంత్రి శ్రీధర్‌బాబు శాసన సభలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బిల్లు తెచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా క్యూర్ చట్టంలో మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరాలతో పోటీపడే విధంగా చేయాలనే ఉద్దేశంతో మూసీ పునరుజ్జీవం చేపట్టామని తెలిపారు. బెంగుళూరు, ముంబై, దిల్లీ మాదిరిగా హైదరాబాద్ మహా నగరపాలిక సంస్థ చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక చేస్తున్నామని వివరించారు. హైదరాబాద్ విస్తరణ పెద్ద ఎత్తున జరుగుతోందని, రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా మరింత సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం తీసుకువచ్చినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్ గత వైభవాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేయాలని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ రూపొందించుకుని ముందుకెళుతున్నామని వివరించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళుతున్నట్లు మంత్రి శ్రీధర్? బాబు తెలిపారు. లక్ష్య సాధనకు హైదరాబాద్ మరింత అధునాతనంగా అంతర్జాతీయ స్థాయికి చేరాలని అన్నారు. ప్రపంచ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలన్నారు. పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించే స్థాయికి మనం ఎదగాలని పేర్కొన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ నినాదంతో రాష్ట్ర అభివృద్ధికి చర్యలున్నాయని గుర్తు చేశారు.క్యూర్' తెలంగాణ ఆర్థిక ప్రగతికి అత్యంత కీలక ప్రాంతమని, రాష్ట్ర విస్తీర్ణంలో చిన్నదైనా తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో క్యూర్ పాత్ర పెద్దదని శ్రీధర్ బాబు వివరించారు. 2025-26లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, క్యూర్ పరిధిలో 10.7 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు. ఆర్థిక వ్యవస్థ సేవా రంగానికి సంబంధించి 68.6 శాతం వృద్ధి నమోదైందని అన్నారు. సేవా రంగం, పెట్టుబడులు, ఉపాధికి ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ ఉందని అన్నారు. క్యూర్ పరిధి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు ఆర్థిక ఉత్పత్తిలో తొలి 3 స్థానాల్లో ఉన్నాయన్నారు. క్యూర్ ప్రాంతంలో పరిపాలన వ్యవస్థను భవిష్యత్ అవసరాల మేరకు పునర్నిర్మించాలన్నారు. హైదరాబాద్?లో రవాణా కోసం కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ చేశామని శ్రీధర్? బాబు తెలిపారు. రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా క్యూర్ చట్టం పని చేస్తుందని అన్నారు. మూసీ పునరుజ్జీవం తొలి దశకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు తీసుకున్నట్లు వివరించారు. 20 టీఎంసీల గోదావరి జలాలు తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీని ట్రై కార్పొరేషన్లుగా విభజించుకున్నామని, అన్ని సంస్థలు సమన్వయంతో పని చేసేలా చట్టబద్ధ వ్యవస్థగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం అధ్యక్షతన క్యూర్ అత్యున్నత పాలక మండలి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహానగరపాలిక చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక చేస్తున్నామన్నారు. మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగం చేసే దిశగా యోచన చేస్తున్నట్లు చెప్పారు. చెట్ల పెంపకం, కాలుష్య నివారణకు వాడాలనే ప్రభుత్వ ఆలోచనలు ఉన్నాయని, హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.



# విదేశాల్లో చదివే విద్యార్థులకు గుడ్‌న్యూస్

## రూ.180 కోట్లు విడుదల చేసిన తెలంగాణ సర్కార్

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** తెలంగాణ ప్రభుత్వం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు భారీ ఊరట కల్పించింది. పెండింగ్‌లో ఉన్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.179.9 కోట్లను తాజాగా వి డుదల చేసింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధుల కేటాయింపు జరిగింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,008 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుం ది. విడుదలైన నిధుల్లో అత్యధికంగా ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద 1,063 మంది మైనారిటీ విద్యార్థులకు రూ.76.1 కోట్లు కేటాయించా రు. అలాగే, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి ద్వారా 1,193 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.48.4 కోట్లు, 573 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.36.9 కోట్లు, మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యా నిధి కింద 179 మంది బీసీ విద్యార్థులకు రూ.18.4 కోట్లు అందజేయనున్నారు. ఇప్పటికే స్కాలర్‌షిప్‌లు మంజూ రైన లబ్ధిదారులందరికీ చెల్లింపు లు పూర్తయ్యాయని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తాని యా తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెంది న ప్రతిభావంతులైన విద్యా ర్థులు అంతర్జాతీయ విశ్వ విద్యాలయాల్లో తమ చదువును ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించేందుకు ఈ నిధులు దోహదపడతాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

# భారత్, చైనా కలిసి నడవాలి

- పరస్పరం సహకరించుకోవాలి
- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వెల్లడి
- నిర్మాణాత్మక చర్చలకు మేం సిద్ధం
- ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- సరిహద్దు వివాదంపై ఇరువురు చర్చ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 :** బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు దిల్లీకి వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భారత మండపంలో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. ఈ క్రమంలో సరిహద్దు వివాదం, వాణిజ్యం సహా పలు అంశాలపై ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంటామని అన్నారు. అతిపెద్ద దేశాలుగా ఉన్న భారత్, చైనా కలిసి నడవాలని, అనేక విషయాల్లో పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే, ఆధునిక టెక్నాలజీ సాయంతో వేగంగా పురోగతి సాధించాలని అభిప్రాయపడ్డారు. ద్వైపాక్షిక సంబంధాల దీర్ఘకాలిక అభివృద్ధిని వ్యూహాత్మక కోణంలో ఇరుపక్షాలు దృష్టిలో ఉంచుకోవడంతోనే చైనా-భారత్ సంబంధాలు అభివృద్ధి చెందాయి. చైనా, భారత్‌లు భిన్నమైనవి. అయినప్పటికీ ఉమ్మడి అభివృద్ధిని సాధించడానికి ఇరు దేశాలు పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి. సహాయం చేసుకున్నాయి. దిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు హాజరవడం, ప్రధాని మోదీని మరోసారి కలవడం నాకు చాలా ఆనందంగా ఉంది. భారత్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు విజయవంతమైనందుకు మోదీకి నా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గత 12 ఏళ్లలో దిల్లీలో తాను పర్యటించడం ఇది రెండోసారని చైనా అధినేత షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. అదే సమయంలో భారత ప్రధాని మోదీని ఇప్పటివరకు 21 సార్లు కలిశానని గుర్తు చేసుకున్నారు. తత్ఫలితంగా తమ ఇద్దరి మధ్య అనేక ముఖ్యమైన ఏకాభిప్రాయాలు కుదిరాయని స్పష్టం చేశారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలుగా, గ్లోబల్ సౌత్‌లో సభ్యులుగా ఇరు దేశాల ఉమ్మడి స్థానాన్ని ఈ సందర్భంగా షీ జిన్‌పింగ్ హైలైట్ చేశారు. మానవాళి ఉమ్మడి భవిష్యత్తు కోసం చైనా, భారత్‌లకు ముఖ్యమైన బాధ్యతలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. చైనా, భారత్‌లు ఒకరి సామర్థ్యాల నుంచి మరొకరు నేర్చుకుంటూ, ఉమ్మడి అభివృద్ధిని సాధించగలవని అన్నారు."భారత్, చైనాలు భిన్నమైన దేశాలు అయినప్పటికీ, ఉమ్మడి అభివృద్ధిని సాధించడానికి పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి. చైనా, భారత్ ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాలు. అలాగే గ్లోబల్ సౌత్‌లో కీలకమైనవి. మానవాళికి ఉమ్మడి భవిష్యత్తు కోసం ఈ రెండు దేశాలపై కీలకమైన బాధ్యతలు ఉన్నాయి. నాణ్యమైన సహకారాన్ని ఇరుదేశాలు కొనసాగించాలి. మరింత సమానత్వం, సమ్మిళితత్వం, స్వేచ్ఛాయుతమైన, ఆర్థికంగా ఏకీకృతమైన ప్రపంచం కోసం కృషి చేయాలి. తద్వారా ప్రపంచ శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి సానుకూల శక్తిని అందించాలి. ఇరు దేశాలు ఆధునిక టెక్నాలజీ సాయంతో వేగంగా పురోగతి సాధించాలి" అని షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశం అనంతరం ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించిన భారత్‌కు చైనా అందించిన మద్దతు, సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. షీ జిన్‌పింగ్‌తో పలు అంశాలపై చర్చించానని వెల్లడించారు. నిర్మాణాత్మక చర్చలకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రకటించారు. "మీకు (జిన్‌పింగ్‌ను ఉద్దేశించి) హృదయపూర్వక స్వాగతం పలకడం నాకు చాలా ఆనందంగా ఉంది. బ్రిక్స్ సదస్సులో మీరు చేసిన సానుకూల వ్యాఖ్యలకు ధన్యవాదాలు. బ్రిక్స్ సమిట్‌కు అధ్యక్షత వహించిన భారత్‌కు చైనా అందించిన మద్దతు, సహకారానికి నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఇప్పుడు మనకు ద్వైపాక్షిక సహకారంపై చర్చించే అవకాశం లభించింది" అని మోదీ స్పష్టం చేశారు. చివరిసారిగా 2019లో భారత్‌లో పర్యటించిన షీ జిన్‌పింగ్, మళ్లీ ఏడేళ్ల తర్వాత ఇండియా టూర్‌కు వచ్చారు. అంతకుముందు 2016, 2014 జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించారు. అయితే, 2020లో గల్వాన్ లోయ ఘర్షణలతో భారత్- చైనా మధ్య సంబంధాలు తీవ్రంగా క్షీణించాయి. దీంతో 2019 తర్వాత భారత పర్యటనకు జిన్‌పింగ్ రాలేదు. ఏడేళ్ల తర్వాత మళ్లీ బ్రిక్స్ సదస్సు కోసం ఇండియాకు వచ్చారు.

# బ్రిక్స్‌కు సరికొత్త దిశ




**ప్రపంచ ఆర్థిక, రాజకీయ యవనికపై శరవేగంగా మారుతున్న సమీకరణల నడుమ భారత్ మరో చారిత్రక ఘట్టానికి ఆతిథ్యమిస్తోంది. ఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విశ్వశాంతికి, ప్రపంచ మానవాళి సంక్షేమానికి సరికొత్త దిశను నిర్దేశిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న వేళ... ఆహారం, ఇంధనం, ఆరోగ్యం, విపత్తుల నిర్వహణ, కీలకమైన సరఫరా వ్యవస్థల పరిరక్షణే లక్ష్యంగా ఈ రెండు రోజుల సదస్సు సాగుతుంది. సవాళ్లతో కూడుకున్న ప్రపంచ పరిస్థితులలో ఒక బలమైన అనుసంధానకర్తగా తన నాయకత్వాన్ని చాటుకునేందుకు భారత్ ముందుకు సాగుతుంది. మరోవైపు ఈ ఏడాది బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం చారిత్రాత్మకమైనదని ప్రధాని మోదీ అభివర్ణించారు. బ్రిక్స్ ఏర్పడి 20 ఏళ్లు పూ-ర్తవుతున్న నేపథ్యంలో.. ఈ వేదిక ఇప్పుడు కొత్త దశలోకి అడుగుపెడుతోందన్నారు. 20 ఏళ్ల వయసు మానవ జీవితంలో పరిపక్వత, బాధ్యతలు పెరిగే దశకు సంకేతమని.. అదే విధంగా బ్రిక్స్ కూడా తన పరిణతి దశకు చేరుకుందని ప్రధాని వ్యాఖ్యానించారు.**

గత రెండు దశాబ్దాల్లో ప్రపంచ వేదికపై బ్రిక్స్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని తెలిపారు. ఎవరికీ వ్యతిరేకంగా కాకుండా.. అందరినీ కలుపుకొని ముందుకు సాగాలన్నదే బ్రిక్స్ విధానంగా ఉండాలని ఆయన అన్నారు. సభ్య దేశాల మధ్య ఐక్యత, ఏకాభిప్రాయాన్ని స్పష్టమైన ఫలితాలుగా మార్చాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రసంగంతో ప్రారంభమైంది. బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వహిస్తున్న నేపథ్యంలో.. ప్రపంచ పాలనలో సంస్కరణలు, గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం, ఆర్థిక సంస్థల్లో మార్పులు వంటి అంశాలపై ప్రధాని మోదీ తన ప్రసంగంలో స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాబోయే 20 ఏళ్లకు బ్రిక్స్ ఒక కొత్త, ప్రతిష్టాత్మక అజెండాతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారత్ బ్రిక్స్ అధ్యక్షత ప్రజా కేంద్రిత, మానవతా ప్రథమ విధానం ఆధారంగా కొనసాగుతోందని ప్రధాని మోదీ చెప్పారు. సౌలభ్యం, ఆవిష్కరణ, సహకారం, స్థిరత్వం తమ ప్రాధాన్యతలని వెల్లడించారు. ప్రపంచ పాలనలో సంస్కరణలకు సంబంధించి సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ రోడ్‌మ్యాప్‌కు ప్రాతినిధ్యం, స్పందన/జవాబుదారీతనం, నియమాల రూపకల్పన అనే మూడు అంశాలు ప్రాతిపదికగా ఉండాలని సూచించారు. ప్రపంచ వ్యవస్థలో అన్ని దేశాలకు సముచిత ప్రాతినిధ్యం ఉండాలని, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలు మరింత సమగ్రంగా ఉండాలని ఆయన అన్నారు.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణలను ఇకపై వాయిదా వేయకూడదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ అంశంపై చర్చలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా నిర్దిష్ట కాలపరిమితి, స్పష్టమైన ఫలితాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పరిస్థితులు మారుతున్నప్పటికీ అంతర్జాతీయ సంస్థల్లో ప్రాతినిధ్య వ్యవస్థ మాత్రం మార్పులకు అనుగుణంగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న దేశాలకు గ్లోబల్ ఎకనామిక్ గవర్నెన్స్‌లో తగిన పాత్ర లభించాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో ఓటింగ్ హక్కులు, నాయకత్వ పదవులు, విధాన ప్రాధాన్యతలు నేటి ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి కీలకంగా ఉన్న దేశాలు.. ప్రపంచ ఆర్థిక పాలనను రూపొందించే ప్రక్రియలో కూడా తగిన స్థానం పొందాలని స్పష్టం చేశారు. రాబోయే 20 ఏళ్లకు కొత్త, ప్రతిష్టాత్మక అజెండాతో బ్రిక్స్ ముందుకు సాగాలని ప్రధానమంత్రి మోదీ ప్రతిపాదించారు. ప్రతి ఏడాది బ్రిక్స్ అధ్యక్ష పదవి మారుతున్నప్పటికీ.. దీనివల్ల సంస్థాగత కార్యక్రమాల వేగం తగ్గకూడదన్నారు. ఇందుకోసం 'కొనసాగింపు మరియు అమలు యంత్రాంగం' ఏర్పాటు చేయాలని భారత్ ప్రతిపాదిస్తోందని తెలిపారు. దీని కింద బ్రిక్స్ కార్యక్రమాలు, నిర్ణయాలు, ఫలితాలను ట్రోయికా ద్వారా పర్యవేక్షించవచ్చని సూచించారు. ప్రపంచ సంక్షోభాలను ఎదుర్కొనే విషయంలో గ్లోబల్ సౌత్ దేశాలు ముందువరుసలో ఉన్నప్పటికీ.. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియల్లో మాత్రం వెనుకబడి ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు.

ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ.. 'విశేషాధికారాల పిరమిడ్'ను 'భాగస్వామ్య వేదిక'గా మార్చాలని పిలుపునిచ్చారు. ప్రతి దేశం గొంతు వినిపించేలా, ప్రతి సభ్యుడికి భాగస్వామ్యం ఉండేలా ప్రపంచ వ్యవస్థ మారాలని అన్నారు. అంతర్జాతీయ నిర్ణయాల్లో మానవాళి అభివృద్ధినే కేంద్రంగా ఉంచాలని ప్రధాని స్పష్టం చేశారు. మొత్తంగా.. బ్రిక్స్ 20 ఏళ్ల ప్రయాణాన్ని కొత్త దశగా అభివర్ణించిన ప్రధాని మోదీ.. రాబోయే రెండు దశాబ్దాలకు సంస్థను మరింత ప్రభావవంతమైన, సమగ్ర, ఫలితాల ఆధారిత వేదికగా మార్చేందుకు భారత్ తరఫున పలు కీలక ప్రతిపాదనలు చేశారు. ముఖ్యంగా సంస్కరణలు, గ్లోబల్ ఆర్థిక సంస్థల్లో మార్పులు, గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం వంటి అంశాలపై మోదీ ప్రసంగం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఏదేమైనా ఈసారి భారత్ లో జరిగే ఈ సదస్సుపై ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నేడు రెండవ రోజు జరిగే పరిణామాలపైనే ఎక్కువగా దృష్టి సారించ వచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు.

13-09-2026 ఎడిటర్

# స్త్రీనిధి రుణాల్లో రూ.30లక్షల అవకతవకలు

## సంగారెడ్డి జిల్లాలో వెలుగులోకి ఘరానా మోసం

### అవకతవకలపై సంఘం సభ్యుల ఆగ్రహం



**హైదారాబాద్, సెప్టెంబర్ 12 :** సంగారెడ్డి జిల్లా కంది మండలం పాతకంది గ్రామ సంఘంలో మహిళా సంఘాలకు మంజూరైన స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు తేలింది. వివిధ మహిళా సంఘాల పేర్లపై మంజూరైన రుణాల్లో సుమారు రూ.30లక్షల మేర నిధులను మాజీ వీవోఏ వినియోగించినట్లు విచారణ నివేదికలో వెల్లడైనట్లు సమాచారం. రుణాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న మహిళలకు ఈ వ్యవహారం తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. దీంతో సదురు మహిళా సభ్యులు మంగళవారం కందిలో నిర్వహించిన డ్వాక్రా మహిళా సంఘాల సమావేశంలో అధికారులను నిలదీశారు. వీవోఏ మార్పు.. వెబ్‌సైట్‌లో నమోదు కాలేదంటూ నివేదిక గత ఏడాది జనవరిలో గ్రామ సంఘం వీవోఏను తొలగించి కుమ్మరి పుష్పలతను కొత్త వీవోఏగా ఎన్నుకున్నట్లు విచారణ నివేదికలో పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు ఆమె పేరు సెర్ప్ ఐబీ వెబ్‌సైట్‌లో నమోదు కాలేదని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అయినప్పటికీ రూ.50 వేల గౌరవ వేతనం డ్రా చేసి ఆమెకు చెల్లించినట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. గ్రామ సంఘ సమావేశాలకు మండల సమాఖ్య నుంచి కమ్యూనిటీ కోఆర్డినేటర్ క్రమం తప్పకుండా హాజరు కాకపోవడం, ఏపీఎం స్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ అవకతవకలకు అవకాశం ఏర్పడినట్లు విచారణ నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. విచారణలో సుమారు రూ.30 లక్షల మేర అవకతవకలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు గుర్తించినప్పటికీ.. ఇప్పటి వరకు మాజీ వీవోఏపై కఠిన చర్యలు తీసుకోలేదని మహిళా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సంబంధిత మహిళా సంఘాలకు కొత్త రుణాల మంజూరు కూడా నిలిచిపోయింది. తమకు రావాల్సిన రుణాలను వెంటనే మంజూరు చేయడంతో పాటు, నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. తమ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలపై ఆధారపడుతున్న తమకు ఈ పరిణామం తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని వారు పేర్కొంటున్నారు. బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

# 'ఢీ-10' డ్యాన్స్ షో విన్నర్ రాజు అరెస్ట్

## లైంగికంగా వేధించాడని యువతి ఫిర్యాదు



**హైదారాబాద్, సెప్టెంబర్ 12 :** తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన 'ఢీ-10' డ్యాన్స్ షో విజేత రాజును హైదరాబాద్ మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. వివరాల్లోకి వెళితే.. ఓ యువతి ఈ నెల 9న మియాపూర్ పోలీసులకు రాజుపై ఫిర్యాదు చేసింది. తనను లైంగికంగా వేధించాడని, సినీ రంగంలో అవకాశాల పేరుతో వంచించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించడంతో రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, రాజు అరెస్ట్ విషయాన్ని పోలీసులు ఇన్ని రోజులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ వార్త బయటకు రావడంతో చర్చనీయాంశంగా మారింది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు ముగిసిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఐరోపా దేశాలను మేం బెదిరించట్లేదు : పుతిన్



**న్యూఢిల్లీ :** బ్రిక్స్ సదస్సు 2026 సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా ఎప్పుడూ ఐరోపాను బెదిరించలేదని.. భవిష్యత్తులోనూ బెదిరించబోదన్నారు. కానీ తమ దేశ ప్రయోజనాలకు, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటో విస్తరణ, ఐరోపా దేశాల జోక్యం వల్లే ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతోందంటూ వ్యాఖ్యానించారు. 'ఐరోపా దేశాలను బెదిరించాలని మేం ఎందుకు అనుకుంటాం? రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి. ఆ తర్వాత జరిగిందంతా రష్యన్ ఫెడరేషన్ సమ్మతితోనే జరిగింది. కానీ ఐరోపా దేశాల నేతలు ఇప్పుడు ఉక్రెయిన్‌లోకి మరింత మంది సైన్యాన్ని పంపడానికి చర్చలు జరుపుతున్నారు. అంటే వారు మాతో యుద్ధాన్ని కోరుకుంటున్నారు. వారి వల్లే యుద్ధం కొసాగుతోంది. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల్లో.. ప్రపంచ దేశాల ఇంధన, ఆహార భద్రతకు సహకరించడానికి రష్యా సిద్ధంగా ఉంది. అంతేకాకుండా పర్యాటకం, పరిశ్రమలు, వాణిజ్యం వంటి రంగాల్లో ఆసక్తికర కార్యక్రమాలకు రష్యా తలుపులు తెరిచే ఉంటాయి. బ్రిక్స్ దేశాలన్నింటికీ చైతన్యవంతమైన, శక్తిమంతమైన దేశీయ మార్కెట్లు ఉన్నాయి. బ్రిక్స్ కూటమి ఎవరికీ వ్యతిరేకం కాదు. అదే విధంగా యావత్ ప్రపంచంతో కలిసి పనిచేయడానికి మాస్కో సిద్ధంగా ఉంది. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం' అని పుతిన్ పేర్కొన్నారు.

# ఒక్క క్లిక్‌తో పలు రకాల సేవలు

## అందుబాటులోకి హైడ్రా వెబ్‌సైట్..



**హైదారాబాద్, సెప్టెంబర్ 12 :** హైదరాబాద్ నగరంలో విపత్తు నిర్వహణ, చెరువుల పరిరక్షణ, ఆస్తుల రక్షణకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు హైడ్రా కీలక అడుగు వేసింది. హైడ్రా అధికారిక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం కొత్త పోర్టల్‌ను ప్రారంభించారు. హైడ్రా అందిస్తున్న సేవలు, కార్యకలాపాలు, అత్యవసర సహాయం, వాతావరణ పరిస్థితులు, చెరువులు, భూములు, అధికార పరిధి తదితర వివరాలను ఇక ప్రజలు ఒకే వేదికపై తెలుసుకునే అవకాశం కల్పించారు. పోర్టల్‌లో చెరువుల హద్దులు, కాలువల వివరాలు, ప్రభుత్వ భూములు, విపత్తు నిర్వహణకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంటుంది. హైడ్రా చేపడుతున్న కార్యకలాపాలు, అధికారిక ప్రకటనలు, క్షేత్రస్థాయి కార్యక్రమాలు, చెరువుల పునరుద్ధరణ వివరాలను కూడా ప్రజలు తెలుసుకోవచ్చు. హైడ్రా 24 గంటల అత్యవసర హెల్ప్‌లైన్ 1070ను పోర్టల్‌లో ప్రత్యేకంగా అందుబాటులో ఉంచింది. చెట్లు కూలడం, అగ్ని ప్రమాదాలు, రహదారులపై నీరు నిలవడం, వరదలు, సహాయక చర్యలు లేదా ఇతర విపత్తు పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు ఈ నంబర్‌కు సమాచారం అందించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ఇది ఉపయోగపడనుంది. ఫైర్ సేఫ్టీ ఎన్వోసీల కోసం కూడా పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించారు. భవన యజమానులు, నిర్మాణదారులు దరఖాస్తు సమర్పించడంతో పాటు అది ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చు. అధికారులు ప్రత్యేక డ్యాష్‌బోర్డు ద్వారా దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకునే వీలుంది. భారీ వర్షాలు, వరదల సమయంలో నీరు నిలిచే ప్రాంతాలను ముందుగానే గుర్తించేందుకు పోర్టల్‌లో ప్రత్యేక మ్యాప్‌లను అందుబాటులో ఉంచారు. జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధిలోని వాటర్‌లాగింగ్, వరద ప్రభావిత ప్రాంతాలను వేర్వేరుగా పరిశీలించవచ్చు. దీంతో వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన ప్రాంతాలపై ప్రజలకు అవగాహన పెరగనుంది. పోర్టల్‌లో లైవ్ రైన్‌ఫాల్ మ్యాప్స్, రోజువారీ వర్షపాతం వివరాలు, వాతావరణ అంచనాలు, హైదరాబాద్ డాప్లర్ రాడార్ సమాచారం అందుబాటులో ఉంటుంది. ముఖ్యంగా భారీ వర్షాల సమయంలో తాజా పరిస్థితులను తెలుసుకోవడానికి ఈ సమాచారం ఉపయోగపడనుంది. హైడ్రా వెబ్‌సైట్ నుంచి హెచ్ఎండీఏ లేక్స్ పోర్టల్‌కు నేరుగా వెళ్లే అవకాశం కల్పించారు. చెరువులు, జలాశయాలకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ వివరాలను పరిశీలించవచ్చు. చెరువుల పరిసరాల్లో నిర్మాణాలు చేపట్టే ముందు వర్తించే నిబంధనలను తెలుసుకోవడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుంది. తెలంగాణ ప్రభుత్వ భూ భారతి పోర్టల్‌కు కూడా హైడ్రా వెబ్‌సైట్‌లో నేరుగా లింక్ ఇచ్చారు. భూమి కొనుగోలు లేదా ఇతర లావాదేవీలకు ముందు సర్వే నంబర్, పట్టాదారు వివరాల ఆధారంగా అందుబాటులో ఉన్న భూ రికార్డులను పరిశీలించుకునే అవకాశం ఉంటుంది.

# పశ్చిమాసియా యుద్ధంతో తీవ్ర నష్టం: జిన్‌పింగ్

**చైనా :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం ఆ ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. ఈ యుద్ధం అంతర్జాతీయ సమాజ ఉమ్మడి ప్రయోజనాలను దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఘర్షణలు, అంతర్జాతీయ పాలన, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలపై బ్రిక్స్ నేతలు చర్చిస్తున్న సమయంలో జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా దేశాల సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే చర్యలను బ్రిక్స్ (దీ=×జూ) సభ్య దేశాలు వ్యతిరేకించాలని జిన్‌పింగ్ సూచించారు. ప్రస్తుతం అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురొంటున్నారన్నారు. ప్రపంచ శాంతి, సుస్థిరత కోసం ముందుండి పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న సంక్షోభానికి ముగింపు పలికేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పరస్పర సహకారం, స్వేచ్ఛాయుత వాణిజ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే కృత్రిమ మేధస్సు రంగంలో సహకారాన్ని బలోపేతం చేయాలని బ్రిక్స్ దేశాలకు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ఈ నూతన సాంకేతిక రంగంలో సభ్య దేశాల మధ్య మరింత సమన్వయం అవసరమని నొక్కి చెప్పారు.



# ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

### రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 :** ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్లు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

# రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు

**హైదారాబాద్, సెప్టెంబర్ 12 :** తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

# కన్నతల్లి మరణవార్త తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య

## మెదక్ జిల్లా పెద్దశంకరంపేట విషాద ఘటన

**హైదారాబాద్, సెప్టెంబర్ 12 :** అమ్మంటే ప్రేమ.. అమ్మంటే ప్రాణం.. కానీ ఆ కన్నతల్లే లేదనే నిజాన్ని ఆ 19 ఏళ్ల కుమారుడు తట్టుకోలేకపోయాడు. తల్లి లేని లోకంలో తాను ఉండలేనంటూ.. అమ్మ వెళ్లిన దారినే తాను ఎంచుకున్నాడు! మెదక్ జిల్లాలో ఒకే కుటుంబంలో గంటల వ్యవధిలో జరిగిన ఈ జంట ఆత్మహత్యలు స్థానికులను కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని మక్తా లక్ష్మపూర్ గ్రామానికి చెందిన బేతమ్మ (45), ఆమె భర్త బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అక్కడే నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా, ఇటీవల హైదరాబాద్‌లోని వారి నివాసంలో భార్యాభర్తల మధ్య స్వల్ప గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బేతమ్మ, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హైదరాబాద్‌లో తల్లి బేతమ్మ ఆత్మహత్య చేసుకున్న విషయం సొంత ఊరిలో ఉన్న ఆమె కుమారుడు ప్రవీణ్ (19)కు తెలిసింది. ప్రాణంగా ప్రేమించే కన్నతల్లి ఇకలేదనే విషయాన్ని ఆ యువకుడు తట్టుకోలేకపోయాడు. తీవ్రమైన మానసిక వేదనకు లోనైన ప్రవీణ్, క్షణికావేశంలో తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. వెంటనే కొలపల్లి గ్రామ శివారులోకి వెళ్లి, అక్కడ ఉన్న ఒక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకే కుటుంబంలో తల్లి, కొడుకు ఇద్దరూ గంటల వ్యవధిలోనే ఆత్మహత్యలకు పాల్పడటంతో మక్తా లక్ష్మపూర్ మరియు కొలపల్లి గ్రామాల్లో తీవ్ర శోకసంద్రం అలుముకుంది. మరణంలోనూ వీడని ఆ తల్లీకొడుకుల బంధం గురించి తలచుకుని గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

ప్రాంతీయం

# రాజీ మార్గమే.. రాజ మార్గం!

- లోక్ అదాలత్‌లో రాజీతో సత్వర న్యాయం
- ఖమ్మంలో 15 బెంచ్‌లు..
- 7,800 కేసుల పరిష్కారానికి కసరత్తు




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 12, ఆర్గాన్ న్యూస్:** కక్షలు.. వివాదాలు.. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగడం.. సమయం, డబ్బు వృథా చేసుకోవడం ఇక వద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు పిలుపునిచ్చారు. రాజీ పడే అవకాశం ఉన్న ప్రతి కేసులో ఇరుపక్షాలు స్నేహపూర్వకంగా రాజీకి వచ్చి సత్వర న్యాయం పొందాలని సూచించారు. “రాజీ మార్గమే రాజ మార్గం” అని స్పష్టం చేశారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఖమ్మం జిల్లాలో ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన న్యాయం అందించేందుకు 15 లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు నాగరాజు తెలిపారు. ఖమ్మం హెడ్‌క్వార్టర్స్‌లో 9, సత్తుపల్లిలో 3, మధిరలో 3 బెంచ్‌లు పనిచేస్తున్నాయని వెల్లడించారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ, వైవాహిక వివాదాలు, ప్రీ-లిటిగేషన్ కేసులు తదితర రాజీపడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని వివరించారు.

### తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానం

లోక్ అదాలత్ ద్వారా వివాదాలను తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఇప్పటికే కోర్టు ఫీజులు చెల్లించి ఉంటే, అవి సంబంధిత పక్షాలకు తిరిగి చెల్లించే అవకాశం ఉందన్నారు. లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల అంగీకారంతో వెలువడే తీర్పుకు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత ఉంటుందని చెప్పారు. ఇరువర్గాల సమ్మతితో పరిష్కారం కావడంతో సాధారణంగా మళ్లీ అప్పీల్‌కు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. దీనివల్ల సమయం, ధనం ఆదా కావడంతో పాటు కోర్టులపై కేసుల భారం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో ఖమ్మం జిల్లా న్యాయశాఖ, పోలీసు శాఖ, న్యాయవాదుల సమన్వయంతో తెలంగాణ రాష్ట్రంలో 5వ ర్యాంకు సాధించిందని నాగరాజు గుర్తుచేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ వంటి మెట్రోపాలిటన్ జిల్లాలతో పోటీపడి ఈ స్థాయిని సాధించడం అభినందనీయమన్నారు.

### 10 వేల కేసుల పరిష్కారమే లక్ష్యం: సీపీ సునీల్ దత్

పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ.. ప్రజల మధ్య చిన్నచిన్న వివాదాలు పెద్ద సమస్యలుగా మారకుండా పరస్పర అవగాహన, ఒప్పందాల ద్వారా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అత్యంత కీలక వేదిక అన్నారు. గత లోక్ అదాలత్‌లో దాదాపు 5,800 కేసులు పరిష్కారం కాగా.. ఈసారి 7,800 కేసులు పరిష్కారానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ సంఖ్యను 10 వేలకు పైగా తీసుకెళ్లడమే లక్ష్యంగా పోలీసు, న్యాయశాఖ, న్యాయవాదులు సమన్వయంతో పనిచేస్తున్నారని వెల్లడించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల బాధితులకు, ఇరువర్గాలకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం లభిస్తుందని సీపీ అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలకు స్నేహపూర్వక ముగింపు పలకాలని కోరారు. కార్యక్రమంలో లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులకు సంబంధించిన చెక్కులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు అందజేశారు. మహిళా కోర్టు న్యాయమూర్తి వీ. శీనయ్య, ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పి.పి. కృష్ణార్జున్, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి మహేష్ నాథ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్, బార్ కౌన్సిల్ సభ్యులు ఎం. శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దేవీ మానస, న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్యానెల్ అడ్వకేట్లు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.








## ఉపాధ్యాయుల వక్తృత్వానికి వేదిక..
# ‘వాయిస్ ఆఫ్ గురు-2026’

- ఖమ్మం జోన్ స్థాయిలో నారాయణ పాఠశాల ఆధ్వర్యంలో పోటీలు
- విద్య, విలువలు, నాయకత్వంపై ఉపాధ్యాయుల ప్రతిభావంతమైన ప్రసంగాలు

**ఖమ్మం, సెప్టెంబర్ 12, ఆర్గాన్ న్యూస్:** ఉపాధ్యాయుల్లో దాగి ఉన్న వక్తృత్వ నైపుణ్యాలను వెలికితీసి, వారి ఆలోచనలు, అనుభవాలను సమాజానికి చేరువ చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన ‘వాయిస్ ఆఫ్ గురు-2026’ (ది టీచర్ స్పీకింగ్ ఛాంపియన్‌షిప్) పోటీలు ఖమ్మం జోన్ స్థాయిలో ఘనంగా జరిగాయి. ఖమ్మం నారాయణ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జోన్ పరిధిలోని వివిధ నారాయణ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ఉపాధ్యాయులు విద్యా రంగం, విలువలు, నాయకత్వ లక్షణాలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి తదితర అంశాలపై తమ అభిప్రాయాలను సమర్థవంతంగా వ్యక్తపరిచారు. ఆసక్తికరంగా సాగిన పోటీల్లో ఉపాధ్యాయుల ప్రసంగ నైపుణ్యం, విషయ పరిజ్ఞానం, ఆత్మవిశ్వాసం, భావవ్యక్తీకరణ ప్రతిభ ఆకట్టుకున్నాయి. జోన్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను నిర్వాహకులు అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు ఉపాధ్యాయుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, వ్యక్తిత్వ వికాసానికి, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. ఉపాధ్యాయుల ప్రతిభను వెలికితీసేందుకు భవిష్యత్‌లోనూ మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నారాయణ విద్యాసంస్థల ఏజీఎం ఎస్. రాంకీ, ఆర్ఐ క్రాంతి కుమార్, కోఆర్డినేటర్ వినోదలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపల్ జి. నవీన్ కుమార్, లైఫ్ స్కిల్స్ ట్రైనర్ నరేష్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## షైన్ హైస్కూల్‌లో ఘనంగా
# వినాయక చవితి వేడుకలు

- సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థుల సందడి
- మట్టి, కూరగాయలు, ఆకులు, పండ్లతో వినూత్న గణనాథుల తయారీ

**బోనకల్, సెప్టెంబర్ 12, ఆర్గాన్ న్యూస్:** స్థానిక షైన్ హైస్కూల్‌లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పండుగ వాతావరణంలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు మట్టి, కూరగాయలు, ఆకుకూరలు, ఆకులు, పండ్లతో వివిధ రకాల వినాయక విగ్రహాలను స్వయంగా తయారు చేసి తమ సృజనాత్మకతను చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా మాట్లాడుతూ విఘ్నేశ్వరుడిని తొలి పూజగా ఆరాధించడం మన సంప్రదాయమని తెలిపారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మికతతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని సూచించారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణహిత వినాయక విగ్రహాలనే ఉపయోగించాలని కోరారు. ప్రిన్సిపల్ అయిటి పాముల శ్వేత మాట్లాడుతూ విద్యార్థులు స్వయంగా వినాయక విగ్రహాలను తయారు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సృజనాత్మకత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ దేగల వేలాద్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

**రామంతపూర్ :** వెంకట్‌రెడ్డి నగర్‌లో ఐదు కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ చొరవతో, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. వెంకట్‌రెడ్డి నగర్ కాలనీకి చెందిన రాగి వెంకట్ రెడ్డికి రూ. 1,13, 000, వాసవి నగర్‌కు చెందిన జెట్టా మౌనికకు రూ. 60,000, వెంకట్‌రెడ్డి నగర్ కాలనీకి చెందిన చిరాకుల్లా సురేష్ గౌడ్‌కు రూ. 60,000, చింతల నవీన్ కుమార్‌కు రూ. 60,000 చొప్పున సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. కష్టకాలంలో ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మందుముల పరమేశ్వర్ రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు నామ్ రాజ్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జలీల్ పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సహాయనిధి లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## భూ సమస్యల పరిష్కారానికి
# టీడీపీ కార్యాచరణ

- 22ఎ సమస్యలపై ఈ నెల 16న కలెక్టర్లకు వినతిపత్రాలు
- ఎల్ఆర్ఎస్, ధరణి--భూభారతి, వక్ఫ్, దేవాదాయ భూములపైనా సమగ్ర చర్చ

**హైదరాబాద్, సెప్టెంబర్ 12, ఆర్గాన్ న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో పార్లమెంట్ పార్టీ కన్వీనర్లు, రాష్ట్ర అనుబంధ సంఘాల మాజీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ భూ సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా 22ఎ నిషేధిత భూముల జాబితా, ఎల్ఆర్ఎస్, దేవాదాయ భూములు, వక్ఫ్ భూములు, ధరణి, భూభారతి, సాదాబైనామాలు, సబ్‌డివిజన్ తదితర అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పార్టీ నాయకులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. 22ఎ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిన టీడీపీ.. ఈ నెల 16న అన్ని జిల్లాల కలెక్టర్లకు పార్లమెంట్ పార్టీ కన్వీనర్ల ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందించాలని నిర్ణయించింది. ప్రైవేటు భూములు పొరపాటున 22ఎ జాబితాలో చేరడంతో ఇబ్బందులు పడుతున్న రైతులు, భూ యజమానులకు పరిష్కారం చూపాలని కోరనుంది. ఈ సందర్భంగా బక్కని నర్సింహులు మాట్లాడుతూ.. 22ఎ నిబంధన ప్రధాన ఉద్దేశం లావుణి, ప్రభుత్వ, దేవాదాయ, భూదాన, వక్ఫ్ తదితర భూములను రక్షించడమేనన్నారు. అయితే అధికారుల తప్పిదాల కారణంగా ప్రైవేటు భూములు కూడా 22ఎ జాబితాలో చేరిన విషయాన్ని ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. దీంతో అనేక మంది రైతులు, భూ యజమానులు తమ భూములపై హక్కులు ఉన్నప్పటికీ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, ఇతర లావాదేవీల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు బాధితులకు న్యాయం జరిగేలా పార్టీ తరఫున కార్యాచరణ కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. సమావేశంలో టీడీపీ మాజీ నాయకులు, పార్లమెంట్ పార్టీ కన్వీనర్లు, రాష్ట్ర అనుబంధ సంఘాల మాజీ అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులే..
# ప్రజల తొలి భరోసా!

- మధిర ఆసుపత్రిలో అన్ని వైద్య సేవలు అందాలి..
- ప్రజల్లో పూర్తి నమ్మకం కలిగించాలి
- రూ.7 కోట్ల కాలేజీ భవనాల పనులకు వేగం..
- సిరిపురంలో ఐటీఐ, ఏఐటీసీ పనులపై కలెక్టర్ దిశానిర్దేశం



**ఖమ్మం, మధిర, సెప్టెంబర్ 12, ఆర్గాన్ న్యూస్:** గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులే ప్రధాన ఆధారమని, వారికి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ వైద్యశాలల్లోనే నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో పూర్తి విశ్వాసం కలిగించేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. శనివారం మధిర పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యుల, సిబ్బంది హాజరు, ఓపీ సేవలు, ల్యాబ్ పరీక్షలు, ఔషధాల లభ్యత, వార్డుల నిర్వహణ, రోగుల నమోదు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులతో నేరుగా మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ సకాలంలో నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. మధిర ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయనే నమ్మకాన్ని మధిర ప్రజల తో పాటు చుట్టుపక్కల నియోజకవర్గాల ప్రజల్లో కల్పించాలని అన్నారు. ఆసుపత్రి పరిసరాలను నిరం తరం పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. అత్యవస ర మందులతో పాటు సాధారణంగా వినియోగించే అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పటిష్టమైన నిల్వ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మందుల కొరత కారణ ంగా ఒక్క రోగి కూడా ఇబ్బందులు పడకూడదని స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే జ్వరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచడంతో పాటు పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేదు

అంతకుముందు మధిర మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అదనపు భవన నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుమారు రూ. 3 కోట్లతో జూనియర్ కళాశాల, రూ. 4 కోట్లతో డిగ్రీ కళాశాల అదనపు భవనం నిర్మిస్తున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సిరిపురం గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం, ఐటీఐ భవనం, ఏఐటీసీ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్న ఈ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నిర్మాణంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పనుల పూర్తికి జిల్లా యంత్రాంగం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. పర్యటనలో మధిర తహసీల్దార్ రాంబాబు, విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, సంబంధిత అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఇందులో ప్రధానంగా “ప్రభుత్వ ఆసుపత్రులే.. ప్రజల తొలి భరోసా!” అనే ఇన్స్పైరింగ్ యాంగిల్‌ను ముందు పెట్టి, కలెక్టర్ తనిఖీని వార్తకు కీలక ఘట్టంగా తీర్చిదిద్దాను.



# టీడీపీ నేతకు మాతృవియోగం

- తల్లి మృతదేహానికి టీడీపీ నేతల నివాళులు
- రెండు వారాల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయిన టీడీపీ మండలాధ్యక్షుడు సత్యనారాయణ కుటుంబం

**బోనకల్, సెప్టెంబర్ 12, ఆర్గాన్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, బోనకల్లు మండల టీడీపీ అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ మాతృమూర్తి సీతమ్మ (90) శనివారం ఉదయం మృతి చెందారు. వయోభారంతో అనారోగ్య సమస్యలకు గురైన ఆమె బ్రాహ్మణపల్లిలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. సీతమ్మ మృతి విషయం తెలుసుకున్న ఖమ్మం పార్లమెంటరీ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం బ్రాహ్మణపల్లికి చేరుకుని ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ తండ్రి మృతి చెందిన రెండు వారాలకే తల్లిని కూడా కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పాలేరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్, మధిర పట్టణ టీడీపీ అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు, జిల్లా తెలుగురైతు మాజీ అధ్యక్షుడు నందమూరి సత్యనారాయణ, ఐటీడీపీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వేమూరి సునీల్, జిల్లా తెలుగుయువత బాధ్యులు మైనేని రవి, బ్రాహ్మణపల్లి టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పాటిబండ్ల సుబ్బారావు, ఐటీడీపీ జిల్లా బాధ్యులు షరీఫ్, టీడీపీ నాయకులు కర్నాటి అశ్వనీ కుమార్, నాగార్జున శ్రీనివాసరావు, కామినేని శ్రీనివాస్, మరీదు బరకయ్య, తాత సుధాకర్, కాంగ్రెస్ నాయకుడు కందుల పాపారావు తదితరులు సీతమ్మ పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

ప్రాంతీయం



## దశదిన కర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్

**రాజాపూర్, సెప్టెంబర్ 12 (ఆర్గాన్ న్యూస్):** రాజాపూర్ మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన కీర్తిశేషులు మామిళ్ల బచ్చిరెడ్డి దశదిన కర్మ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్చర్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ హాజరై బచ్చిరెడ్డికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బచ్చిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పుష్పాంజలి ఘటించారు. బచ్చిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎర్ర శేఖర్, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.




## అధికార బలంతో అక్రమ కేసులు

- ఆధారాలతో ముందుకు రావాలి
- అధికార బలముతో రేగ కళ్యాణి నా భర్త పై అక్రమ కేసులు
- తాడ్వాయి సర్పంచ్ ప్రవళిక

**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 12:** నన్ను రాజకీయంగా ఎదుర్కోలేక నా భర్తపై అక్రమ కేసులు పెట్టిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని భయపెట్టే ప్రయత్నాలు ఎంతకాలం చేస్తారు? ఫంక్షన్ హాల్ విషయంలో మా వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయి. ఫంక్షన్ హాల్ మా ఆధ్వర్యంలోనే ఉందని మేము స్పష్టంగా చెబుతున్నాం. దీనికి భిన్నంగా ఆధారాలు మీ వద్ద ఉన్నాయని చెబుతున్నట్లయితే వాటిని బయటపెట్టి ధైర్యంగా ముందుకు రావాలి. కేసులతో కాదు. ఆధారాలతో సమాధానం చెప్పండి. అధికార బలంతో కాదు. ప్రజల ముందు నిజంతో నిలబడండి. మంత్రి సీతక్క ఆమె అనుచరులు ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి. అధికార బలాన్ని ఉపయోగించి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా నిజాలు ఆధారాలతో ప్రజల ముందుకు రావాలి. అధికారం శాశ్వతం కాదు. నిజం ఎప్పటికైనా బయటకు వస్తుంది. మాపై ఆరోపణలు చేసే వారికి నిజంగా ఆధారాలు ఉంటే ధైర్యంగా ముందుకు వచ్చి నిరూపించాలి. అధికార బలంతో కేసులు పెట్టించడం ద్వారా మమ్మల్ని భయపెట్టలేరని తాడ్వాయి స్థానిక సర్పంచ్ ప్రవళిక అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాజీ గ్రంథాలయ చైర్మన్ గోవింద నాయక్ మాజీ జడ్పిటిసి రామసేన శ్రీనివాస్ రెడ్డి స్థానిక ప్రజలు స్థానిక రాజకీయ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## యువతకు ఉద్యోగ ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

- రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలి
- డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్

**ములుగు జిల్లా, సెప్టెంబర్ 12 (ఆర్గాన్ న్యూస్):** యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ఆరోపించారు. ప్రభుత్వాల అసమర్థ విధానాల కారణంగా దేశంలో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో నిర్వహించిన భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ములుగు జిల్లా 2వ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ యువతకు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం, 12 ఏళ్లు గడిచినా ఆ హామీని అమలు చేయకుండా కోట్లాది మంది నిరుద్యోగ యువతకు తీవ్ర నిరాశ మిగిల్చిందని విమర్శించారు. ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ ఉద్యోగ అవకాశాలను తగ్గిస్తుండగా, మరోవైపు నీట్, రైల్వే, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకులు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థులు, యువత భవిష్యత్తు దెబ్బతింటోందన్నారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లోనే సుమారు పది లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ తక్షణమే భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

### హామీలను అమలు చేసి ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వాలి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని వెంకటేష్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి నోటిఫికేషన్లు విడుదల చేస్తామని, ఎన్నికల మేనిఫెస్టోలో యూత్ డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. సమగ్ర వివరాలతో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి, ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి అందించాలని కోరారు. స్వయం ఉపాధి కోసం ప్రకటించిన రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తులు స్వీకరించడానికే పరిమితం కాకుండా అర్హులైన నిరుద్యోగ యువత అందరికీ రుణాలు మంజూరు చేయాలని అన్నారు.

### డ్రగ్స్ నిర్మూలనతో పాటు ములుగులో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని, నిరంతర నిఘా ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని వెంకటేష్ కోరారు. విద్యార్థులు, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ములుగు జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కలువల రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అరుణ్, లాజర్, పూనెం కృష్ణబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రత్న, ప్రవీణ్, జిల్లా నాయకులు మమత, శ్యామ్, రమేష్, రాఘవేంద్ర, సంతోష్, శివ, ప్రవీణ్, లోకేష్, అశోక్, దినేష్‌తో పాటు సుమారు 100 మంది యువత పాల్గొన్నారు.

# వచ్చే విద్యా సంవత్సరం నుంచే..
# యంగ్ ఇండియా గురుకులాలు!

- నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయాలి.. నాణ్యతలో రాజీ వద్దు
- రూ.200 కోట్లతో అత్యాధునిక వసతులు..
- విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలకు పెద్దపీట



**చింతకాని, బోనకల్లు , సెప్టెంబర్ 12, ఆర్గాన్ న్యూస్:** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని స్పష్టం చేశారు. మధిర నియోజకవర్గం పరిధిలోని బోనకల్ మండలం లక్ష్మీపురంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను శనివారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హాస్టల్ భవనాలు, అకడమిక్ బ్లాక్‌లు, డార్మెటరీ,



వంటగది, భోజనశాల, ప్రధాన నివాస భవనం, క్వార్టర్స్ తదితర నిర్మాణ ప్రాంతాలను కాలినడకన పరిశీలించి పనుల పురోగతిని, నాణ్యతా ప్రమాణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఖమ్మం జిల్లాలో ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో పాఠశాలను సుమారు రూ. 200 కోట్ల వ్యయంతో 25 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ విద్యార్థులు చిన్ననాటి నుంచే సమాన వాతావరణంలో కలిసి చదువుకునేలా ఈ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని పేర్కొన్నారు.

### ఏప్రిల్ నాటికి పూర్తి.. వచ్చే విద్యా సంవత్సరం నుంచే సేవలు

మధిర నియోజకవర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి నిర్మాణాన్ని పూర్తిచేసి సంబంధిత శాఖకు అప్పగించాలని, తద్వారా వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. హాస్టళ్లు, అకడమిక్ బ్లాకులతో పాటు అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పచ్చదనం, లింక్ రోడ్లు వంటి మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థులకు భవిష్యత్తులో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంలో విద్యార్థులు రాణించేలా అత్యాధునిక మౌలిక వసతులతో ఈ విద్యాసంస్థలను ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. నిర్మాణ సంస్థలు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షించి, నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### రూ.29 కోట్లతో నర్సింగ్ కళాశాల

అనంతరం చింతకాని మండలం లచ్చగూడెంలో రూ. 29 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల పనులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పరిశీలించారు. నిర్మాణ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ పర్యటనలో బోనకల్ తహసీల్దార్, విద్యాశాఖ ఇంజినీరింగ్ అధికారి బుగ్గయ్య, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## హోటల్ వెంకటయ్యకు అభిమన్యు రెడ్డి పరామర్శ

**రాజాపూర్ ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 12:** రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన హోటల్ వెంకటయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి శనివారం ఆయన స్వగృహానికి వెళ్లారు. ఈ సందర్భంగా వెంకటయ్యను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తూ ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింలు, శ్రీధర్ రెడ్డి, నజీమ్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పుడు ప్రేమ.. ఇప్పుడు మౌనం!

**మహేశ్వరం నియోజకవర్గం భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యదర్శి సామ మహేందర్ రెడ్డి**



**రంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్,సెప్టెంబర్ 12:** ఆశా వర్కర్లకు నెలకు 18 వేల గౌరవ వేతనం ఇస్తామని, ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆశా అంగన్వాడీ వర్కర్ల సమస్యలపై పెద్ద ఎత్తున మాట్లాడిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే వర్కర్ల సమస్యలను ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. శనివారం నాడు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆశ వర్కర్లకు నెలకు 18000 గౌరవ వేతనం ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా ఆహామీని అమలు చేయకపోవడం దారుణమని అన్నారు గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఆశా వర్కర్లు మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో అంగన్వాడీ వర్కర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు వారి కష్టాన్ని గుర్తించి గౌరవ వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మాట తప్పడం సరికాదని అన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన 18, హామీని తక్షణమే అమలు చేయాలని ఆశ అంగన్వాడీ వర్కర్లకు న్యాయం జరిగే వరకూ భారత రాష్ట్ర సమితి పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని సామా మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

## కాంట్రాక్టర్లపై కనికరం కలగదా..?

- పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి
- శాసనమండలి చైర్మన్‌కు కాంట్రాక్టర్ చందా కుమార్ వినతి



**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్,సెప్టెంబర్ 12:** అభివృద్ధి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించి వారి కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని శాసనమండలి చైర్మన్‌కు ములుగు జిల్లా కాంట్రాక్టర్ చందా కుమార్ వినతిపత్రం అందజేశారు. రహదారులు తాగునీటి పథకాలు పాఠశాలలు భవనాలు సాగునీటి పనులు తదితర అభివృద్ధి కార్యక్రమాలను అప్పులు చేసి పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో అధిక వడ్డీల భారం పడుతోందన్నారు. మిషన్ భగీరథ మన ఊరు మన బడి ఎస్‌డీఎఫ్ తదితర పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బిల్లులు ఆలస్యం కావడంతో బ్యాంకు రుణాలు ప్రైవేట్ అప్పులు కార్మికులు సరఫరాదారుల బకాయిలు చెల్లించలేక కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి అర్హత ఉన్న బిల్లులను రాజకీయాలకు అతీతంగా వెంటనే చెల్లించేలా ప్రభుత్వంపై దృష్టి సారించాలని శాసనమండలి చైర్మన్‌ను కోరారు. కాంట్రాక్టర్లను అభివృద్ధి భాగస్వాములుగా గుర్తించి వారి కుటుంబాలను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని చందా కుమార్ విజ్ఞప్తి చేశారు.

## ప్రత్యేక ప్రచార దినాలను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి
- ఎన్నికల నమోదు అధికారి ఆర్డీవో కృష్ణవేణి



**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్12:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినాలను అర్హులైన ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి సూచించారు. శనివారం ములుగు మల్లంపల్లి వెంకటాపురం మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నమోదు అధికారి తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారుల అందుబాటు ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులు క్లెయిమ్స్ అభ్యంతరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడంతోపాటు ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా బూత్ స్థాయి అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం 6 పేర్ల తొలగింపునకు ఫారం 7 వివరాల సవరణకు ఫారం 8 దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. ఓటర్ల నుంచి అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. ప్రత్యేక ప్రచార దినాల్లో బూత్ స్థాయి అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ములుగు తహసీల్దార్ ఎన్. విజయభాస్కర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నగేష్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రాజేందర్ జూనియర్ అసిస్టెంట్ సాత్విక్ బూత్ స్థాయి అధికారులు సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

**మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



**సికింద్రాబాద్ :** ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పాటు ప్రమాదకర రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను పూజించి నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై పర్యావరణానికి హాని కలుగుతుందని అన్నారు. మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడిన వారమవుతామని పేర్కొన్నారు. మట్టి విగ్రహాల వినియోగంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.




## మట్టి వినాయకుల పంపిణీ

**శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నల్లగండ్ల డివిజన్ ఎన్‌టీఆర్ నగర్, సోఫా కాలనీలోని నియో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ మట్టి వినాయకుల పంపిణీ కార్యక్ర మాన్ని నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని విద్యార్థు లకు అవగాహన కల్పిస్తూ మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్, రాజు నాయక్ పాల్గొని విద్యార్థులకు మట్టి వినాయకులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను ఉపయోగించడం ద్వారా ప్రకృతిని పరిరక్షించవచ్చని తెలిపారు. విద్యార్థులు, ప్రజలు మట్టి వినాయకులను ప్రోత్సహించి పర్యావరణ పరిర క్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "మట్టి వినాయ కుడిని పూజిద్దాం -- పర్యావరణాన్ని కాపాడుదాం" అని సందేశమిచ్చారు.

# వినాయక చవితికి ముందు..
# గౌరీపూజ ఎందుకు?



### సౌభాగ్యం, మంగళం, సంపదకు ప్రతీకగా గౌరీదేవి ఆరాధన

### గౌరీపూజ మరుసటి రోజే గణేశ చతుర్థి.. మహిళలకు ప్రత్యేకమైన పూజా సంప్రదాయం

వినాయక చవితి వచ్చిందంటే ప్రతి ఇంటా పండుగ సందడి మొదలవుతుంది. వినాయకుడి ప్రతిష్ఠకు ముందు రోజు అనేక ప్రాంతాల్లో గౌరీదేవిని ప్రత్యేకంగా పూజించడం ఆనవాయితీగా వస్తోంది. అసలు వినాయక చవితికి ముందు గౌరీపూజ ఎందుకు చేస్తారు? గౌరీదేవికి, గణేశుడికి ఉన్న సంబంధం ఏమిటి? అనే విషయాలు తెలుసుకోవడం ఆసక్తికరం.

శక్తికి మూలంగా, మంగళానికి ప్రతీకగా గౌరీదేవిని భక్తులు ఆరాధిస్తారు. ముఖ్యంగా వివాహిత మహిళలు గౌరీపూజను సౌభాగ్యాన్ని ప్రసాదించే పూజగా భావిస్తారు. గౌరీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల కుటుంబంలో సుఖసంతోషాలు, ఆనందం, ఐశ్వర్యం కలగడంతో పాటు భర్తకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం.



**ఆర్గాన్ న్యూస్ ప్రత్యేక కథనం:** భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో గౌరీ పండుగ, గౌరీ చౌతి, గౌరీ గణేష్ వంటి పేర్లతో ఈ పండుగను జరుపుకుంటారు. వరమహాలక్ష్మి వ్రతం తరహాలోనే గౌరీపూజను నిర్వహిస్తారు. అయితే వరమహాలక్ష్మి పూజలో లక్ష్మీదేవిని ఆరాధిస్తే, ఈ పూజలో గౌరీదేవిని మంగళప్రదాయినిగా భావించి పూజించడం ప్రత్యేకత. గౌరీపూజలో భాగంగా అమ్మవారి రూపాన్ని పసుపుతో తయారు చేసి అలంకరించడం, బియ్యం లేదా ధాన్యాలతో కలశాన్ని ఏర్పాటు చేయడం, పూలు, పండ్లు తదితరాలను సమర్పించి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ముఖ్యంగా మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి కుటుంబ సౌభాగ్యం, శాంతి, సిరిసంపదలు కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తారు.

## గౌరీపూజ తర్వాతే గణేశుడి ఆరాధన

గౌరీపూజ మరుసటి రోజు భాద్రపద శుద్ధ చవితి సందర్భంగా గణేశ చతుర్థి పర్వదినాలు ప్రారంభమవుతాయి. జ్ఞానం, వివేకం, ఐశ్వర్యం, ఆరోగ్యం, దీర్ఘాయుష్షు, విజయాలను ప్రసాదించే దేవుడిగా గణేశుడిని భక్తులు కొలుస్తారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిగా గణపతిని పూజిస్తూ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. కుటుంబ సంప్రదాయాలను బట్టి గణేశ చతుర్థిని ఒక రోజు, మూడు రోజులు, ఏడు రోజులు లేదా పది రోజుల పాటు నిర్వహిస్తారు. కొందరు గౌరీదేవి విగ్రహంతో పాటు గణేశుడిని ఇంటికి తీసుకొచ్చి పూజిస్తారు. మరికొందరు గౌరీదేవి విగ్రహాలతో పాటు మరో రెండు గౌరీ రూపాలను గణేశుడి సోదరీమణులుగా భావించి ఆరాధిస్తారు. ఇలా ముందుగా గౌరీదేవిని పూజించి, ఆ తర్వాత విఘ్నేశ్వరుడిని ఆరాధించడం ద్వారా శక్తి, మంగళం, జ్ఞానం, సౌభాగ్యం, సంపద తమ కుటుంబాల్లో నిండాలని భక్తులు ఆకాంక్షిస్తారు. ప్రాంతాలు, కుటుంబ సంప్రదాయాలను బట్టి ఆచారాల్లో స్వల్ప మార్పులు ఉన్నప్పటికీ గౌరీ-గణేశుల ఆరాధనకు భారతీయ సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉంది.



- గౌరీదేవిని వినాయకుడికి ముందుగా పూజించడం వెనుక ప్రధానంగా కుటుంబసౌభాగ్యం, శక్తి, మంగళం అనే భావన ఉంది.
- గౌరీదేవి = శక్తి, మంగళం, సౌభాగ్యానికి ప్రతీక. పార్వతీదేవినే గౌరీగా ఆరాధిస్తారు.
- వినాయకుడు = గౌరీదేవి కుమారుడు. అందువల్ల తల్లిని ముందుగా ఆరాధించి, ఆ తర్వాత కుమారుడైన గణేశుడిని పూజించడం ఒక సంప్రదాయంగా ఏర్పడింది.
- ముఖ్యంగా వివాహిత మహిళలు గౌరీపూజను కుటుంబ సౌభాగ్యం, భర్తకు ఆయురారోగ్యాలు, కుటుంబ శ్రేయస్సు కోసం నిర్వహిస్తారు.
- గౌరీపూజ ద్వారా ముందుగా శక్తి, మంగళం, సౌభాగ్యాన్ని కోరుకుని, మరుసటి రోజు వినాయకుడిని పూజించి విఘ్నాలు తొలగి జ్ఞానం, విజయం, ఐశ్వర్యం కలగాలని ప్రార్థిస్తారు. అందుకే కొన్ని ప్రాంతీ య సంప్రదాయాల్లో "ముందు గౌరీ.. తర్వాత గణేశుడు" అనే క్రమం కనిపిస్తుంది. అయితే ఇది అన్ని ప్రాంతాల్లో తప్పనిసరిగా పాటించే ఒకే విధమైన శాస్త్ర నియమం కాదు. గౌరీపూజ, గణేశ చతుర్థి ఆచారాలు ప్రాంతం, కుటుంబ సంప్రదాయం, ఆగమ/స్థానిక పద్ధతులను బట్టి మారుతాయి. సరళంగా చెప్పాలంటే:
- గౌరీ = శక్తి, మంగళం, సౌభాగ్యం → గణేశుడు = జ్ఞానం, విఘ్ననివారణ, విజయం.
- అందుకే ముందుగా అమ్మవారిని పూజించి, అనంతరం కుమారుడైన వినాయకుడిని ఆరాధించే సంప్రదాయం ఏర్పడింది.





## మట్టి వినాయకులపై విస్తృత ప్రచారం జరగాలి

### బడంగ్ పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని ప్రసాద్

**రంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 12:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా పిఓపి రసాయన రంగులతో తయారు చేసిన వినాయకుడి విగ్రహాల స్థానంలో మట్టి ప్రతిమలను పూజించే విధానం పై విద్యార్థులకు విస్తృత ప్రచారం చేయవలసిన అవసరం ఉందని మట్టి వినాయకులపై ఇలాంటి ప్రచారం జరగాల్సిన అవసరం ఉ ందని బడంగ్ పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలసాని ప్రసాద్ కోరారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం రసాయన శాస్త్ర విభాగం ఏకో క్లబ్ ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ (డబ్ల్యూ ఈ సి ) సంయుక్త ఆధ్వర్యంలో బడంగ్ పేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానికులకు గణనాథుని విగ్రహాలను మట్టి ప్రతిమలు అందజేశారు ఈ సందర్భంగా ప్రసాదు మాట్లాడుతూ వాయు నీటి కాలుష్యం తగ్గించడానికి మట్టి గణనాథుల్ని పూజించాలని కోరారు విద్యార్థులు ప్రతి సంవత్సరం వినాయక చవితి సందర్భంగా దీనిపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించవలసిన అవసరం ఉన్నది అని అన్నారు వచ్చేయడాది ఈ విషయంపై తాము ప్రత్యేక దృష్టి పెడతామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఏకో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ రామరాజు వయసు ప్రిన్సిపల్ డాక్టర్ రాజకుమార్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ జ్యోతి అక్కడ మీకు కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహారాజు కెరియర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ రేవతి సిహెచ్ వెంకట్రెడ్డి నరసింహ రోహిత్ సురేష్ డాక్టర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి పండగ
# పర్యావరణహితంగా సాగాలి

### (రేపు) అనగా 14వ తేదీ వినాయక చవితి సందర్భంగా ఆర్గాన్ న్యూస్ పాఠకులకు రంగారెడ్డి ప్రతినిధి అక్కినేపల్లి పురుషోత్తమరావు అందజేస్తున్న ప్రత్యేక కథనం)

వినాయక చవితి మన భారతీయ సమాజంలో భక్తి ఐక్యత ఉత్సాహాన్ని ప్రతీకగా నిలిచే పండుగ . విఘ్నాలను తొలగించే వినాయకుడిని పూజించడం మన సంప్రదాయంగా వస్తుంది అయితే కాలానుగుణంగా పండుగల నిర్వహణలో ఎన్నో మార్పులు వచ్చాయి భక్తి, ఆధ్యాత్మికత, సాంప్రదాయం,కంటే ఆర్భాటం, పోటీ ప్రదర్శన, ఎక్కువ అవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా సుమారు 25 నుండి 30 వేల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుందని కొన్ని నివేదికలు తెలుపుతున్నాయి ఈ నేపథ్యంలో వినాయక చవితి పర్యావరణహితంగా జరుపుకో లేమా? అన్న ప్రశ్న చవితి స్వాతంత్ర్యం కోసం పోరాడే వారందరినీ ఒక జెండా కిందికి తీసుకువచ్చి ప్రజలలో దేశభక్తిని పెంపొందించే స్థలం చైతన్యం కలిగించడం జరిగింది వినాయక చవితి 1893 ముందు ఎక్కువ ఇళ్లలో జరుపుకునే ఆచార పద్ధతిగా ఉండేది. బాల గంగాధర తిలక్ దానిని సామాజిక ఉత్సవంగా మార్చి సమాజంలో అన్ని వర్గాల హిందువులను ఒకటిగా చేసే ప్రయత్నం చేశారు జాతీయ ఉద్యమంలో వినాయక చవితి సామూహిక పండుగగా మార్చిన ఘనత లోకమాన్య బాలగంగాధర్ తిలక్ దే బ్రిటిష్ పరిపాలనలో ప్రజలను ఒక వేదికపైకి తీసుకురావడం కష్టమైన సమయంలో ఆయన వినాయక చవితిని ఒక జాతీయ పండుగగా మార్చారు ప్రజలు గుమికుడి పూజలు చేయడం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం స్వాతంత్ర్య పోరాటాలు జాతీయ గీతాలు జాతీయ చైతన్యం విస్తరించడం వలన వినాయక చవితి ఒక సంస్కృతిక రాజకీయ పునర్జీవ వేదికగా నిలిచింది కానీ నేడు ఒకే వీధిలో ఒకే గ్రామంలో రెండు మూడు వినాయక మండపాలు కులాల వారీగా వర్గాల వారీగా రాజకీయ పార్టీల వారీగా విడిపోయి



జరుపుకుంటున్నాయి కానీ ప్రస్తుతం అనేక పెద్ద గణపతి మండపాలకు ఘనపలకు కార్పొరేట్ లేదా రాజకీయ పార్టీల సహకారం లభిస్తోంది ఇది ఒక విధంగా ఓటు బ్యాంకు రాజకీయాలకు దారితీస్తోంది. వినాయక చవితి ఒక మతపరమైన పండుగ మాత్రమే కాకుండా చరిత్రలో స్వాతంత్ర్య పోరాటానికి ఆయుధం నేడు రాజకీయ ప్రభావానికి వేదిక. రాజకీయాల సమ్మేళనంగా ప్రత్యేక స్థానం సంపాదించింది కానీ ప్రస్తుతం వినాయక విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయనిక రంగులు వాడడం వలన చెరువులు నదులు ఇతర జలవనులు తీవ్రంగా కలుషితమవుతున్నాయి నిమజ్జనం తర్వాత నీటిలో కలిసే రసాయనాలు జలచరాలకు హాని కలిగించడమే కాకుండా నీటి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి పూజా సామగ్రి ప్లాస్టిక్ కవర్లు అలంకరణ వ్యర్థాలు కూడా నీటి వనరులకు చెత్త కుప్పలుగా మారుస్తున్నాయి. దేవుడిని పూజించే పేరుతో ప్రకృతి నాశనం చేయడం ఎంతవరకు సమంజసం అయితే సమస్య కేవలం ప్రజలదే కాదు వ్యవస్థలోని పర్యావేక్ష ణా లోపం కూడా ప్రధాన కారణం. పర్యావరణ నిబంధనలు శబ్ద కాలుష్యం పరిమితులు విగ్రహాల తయారీకి సంబంధించిన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ వాటి అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడంలో అధికార యంత్రాంగం తరచూ విఫలమవుతుంది. నిబంధనలు కాగితాలపై కఠినంగా ఉన్న వాటిని ఉల్లంఘించినప్పుడు చర్యలు తీసుకోవడంలో మాత్రం నిర్లక్ష్యం కనిపిస్తోంది. పర్యావరణహిత వినాయక చవితి అంటే పండుగను ఆపివేయడం కాదు పండుగను బాధ్యతతో జరుపుకోవడం మట్టి వినాయకుడిని ప్రతిష్టించి సహజ పర్యావరణం పదార్థాలతో అలంకరించి ఇంట్లోనే లేదా నిర్దేశిత ప్రదేశాలలో నిమజ్జనం చేయవచ్చు. పూజా సామాగ్రి నీటిలో పడవేయకుండా ప్రత్యేకంగా సేకరించి సరియైన విధంగా నిర్వహించవచ్చు గణేష మండపాలు పోటీకి కాకుండా సేవా కార్యక్రమాలకు వేదికలుగా మారాలి వినాయకుడు విజ్ఞానాలను తొలగించే దేవుడు మరి మన పండగ వల్లే పర్యావరణానికి కొత్త విఘ్నాలు ఎందుకు సృష్టించాలి ప్రకృతిని కాపాడడమే వినాయకుడికి మనం ఇవ్వగలిగే నిజమైన నైవేద్యం పర్యావరణ పరిరక్షణ బాధ్యత ఒక ప్రభుత్వానిదే కాదు అధికారులకు కూడా కాదు నిర్వాహకులదే కాదు ప్రభుత్వ నిబంధనలను కఠినంగా అమలు చేయాలి రాజకీయ నాయకులు బాధ్యతాయుతమైన ఆదర్శాన్ని చూపాలి నిర్వహకులు ఆర్భాటానికి దూరంగా ఉండాలిఉండాలి. ప్రజలు యువత తమ గొప్పతనాన్ని పర్యావరణహిత మార్గంలో జరిపి చూపించాలి ప్రకృతి మరియు సమాజాన్ని గౌరవిస్తూనే గణేశుడి పండుగను భక్తితో జరుపుకోవడం నిజంగా అర్థవంతం చేస్తుంది.

# ఉల్లిగడ్డకు మళ్లీ రెక్కలొచ్చాయి

## ఉల్లి రిటైల్ గా కిలో 50 రూపాయలు పలుకుతున్న వైనం

## వర్షాభావ పరిస్థితులతో తగ్గిన ఉల్లి దిగుబడి

**రంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, సెప్టెంబర్ 12:** ఉల్లిపాయ ధరలు గత కొద్ది రోజుల నుంచి శరవేగంగా పెరుగుతూ ప్రజలకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. కొద్దిరోజుల నుంచి ధరలు పైపైకి చేరుకోవడంతో ప్రజలు ఆందోళనకు గురి అవుతున్నారు కొద్ది రోజుల క్రితం వరకు ధరలు కిలో ఉల్లి పది రూపాయల నుంచి 25 రూపాయల వరకు పలికింది. కాగా వర్షాభావ పరిస్థితులలో ఉల్లి పంట దిగుబడి తగ్గడంతో క్రమక్రమంగా ఉల్లిపాయల రేటు పెరుగుతూ ప్రస్తుతం రొటీన్ మార్కెట్లో కిలో ఉల్లి 50 రూపాయలు ధర పలుకుతుంది. గత సంవత్సరం సెప్టెంబర్ 9వ తేదీన మలక్పేట మార్కెట్ ధర 36,670 ఉల్లిపాయ బస్తాలు రాగా మొదటి రకం ఉల్లిపాయ క్వింటాలు కనిష్ట ధర 1600 గరిష్ట ధర 1800 అదేవిధంగా క్వింటాల్ మోడల్ ఉల్లిపాయలు 17,00 ధర పలికింది. అదేవిధంగా రెండో రకం ఉల్లిపాయలు క్వింటాలు కనిష్ట 400 నుంచి గరిష్ట ధర క్వింటాల్ ఉల్లి, 1500 పలికింది. మోడల్ క్వింటాల్ ఉల్లిపాయలు వెయ్యి ధర పలికింది ఈ సంవత్సరం సెప్టెంబర్ 9వ తేదీ బుధవారం నాడు మలక్పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో సుమారు 15,385 ఉల్లి బస్తాలు రావడం జరిగింది కాగా మొదటి రకం క్వింటాల్ ఉల్లిపాయలు కనిష్టదర 4,300, క్వింటాల్ ఉల్లిపాయ గరిష్ట ధర 5,200 పలికింది రిటైల్ మార్కెట్లో కిలో ఉల్లి 50 రూపాయలు పలుకుతుంది నగరంలోనే ప్రముఖ మార్కెట్లలో ఒకటైన మలక్పేట మహబూబ్ మెన్షన్ మార్కెట్ కు తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు కర్నూలు మహారాష్ట్ర కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి ఉల్లి వస్తువు ఉండడం వర్షాభావ పరిస్థితుల మూలంగా ఉల్లి పంట దిగుబడి తగ్గి మార్కెట్ తక్కువ సంఖ్యలో ఉల్లిపాయలు దిగిపోతే అవుతున్నాయి కర్నూల్లో పంట తక్కువగా ఉండడంతో అరకొరగా వస్తుండడం



మహారాష్ట్ర కర్ణాటక నుంచి మాత్రమే ఉల్లిపాయలు మలక్పేట మహబూబ్ మెన్షన్ మార్కెట్కు దిగుమ తి అవుతున్నాయి కొద్దిరోజుల క్రితం వరకు కిలో ఉల్లి పది నుంచి 25 రూపాయలు ధర మాత్రమే ఉండగా ప్రస్తుతం ఒక్కసారిగా కిలో ఉల్లి 50 రూపాయలు రిటైల్ మార్కెట్లో చేరు కోవడం జరిగింది కాగా అక్టోబర్ నవంబర్ నెలలో కొత్త ఉల్లి పంట వస్తే ధరలు తగ్గుతాయి అని వ్యాపారులు పేర్కొంటున్నారు.



## మౌలిక సదుపాయాలు కల్పించాలి

### మీర్ పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానాచార్యులు కాంతారావు

**రంగారెడ్డి ప్రతినిధి,ఆర్గాన్ న్యూస్,సెప్టెంబర్ 12:** మీర్ పేటప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ప్రధానోపాధ్యాయులు కాంతారావు కోరారు. శనివారం నాడు మా ప్రతినిధి ఆ పాఠశాలను సందర్శించగా అనేక విషయాలు మా దృష్టికి వచ్చాయి. పాఠశాలలో ఉన్న మహిళా ఉపాధ్యాయులు విద్యార్థినులకు, బాత్రూములు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని పాఠశాల ఆవరణలో, వాష్ రూమ్లు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న పెద్ద చెట్టును అటవీ శాఖ వారు తొలగించాలని, ఆ పెద్ద చెట్టు వల్ల పాఠశాల భవనం కూలిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేస్తున్నామని, సన్న బియ్యంతో వారికి భోజనం ఏర్పాట్లు చేస్తున్నామని, తెలిపారు. ఇది ఇలా ఉండగా గత రెండు నెలల నుండి వంటలు వండే వారికి వేతనాలు లేక అవస్థలకు గురి అవుతున్నామని వంట వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే ప్రభుత్వం వారికి వేతనాలు అందజేసి ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో మంచినీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కనీసం ఒక బోరు ప్రభుత్వం ఏర్పాటు చేస్తే విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందించే అవకాశం ఉంటుందని, ప్రస్తుతం మధ్యాహ్నం భోజన సౌకర్యం లో కట్టెలపైనే వంటలు వండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రభుత్వం కనీసం నెలకు రెండు సిలిండర్లు అందుబాటులోకి తెస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని కాంతారావు వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలోనే పోలీసు శాఖ వారు తమ వాహనాలను పార్కు చేయడంతో ఆట స్థలంలో విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని, పోలీసు శాఖకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా వారి వాహనాలను ఇక్కడ పార్కు చేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, మంజుల తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లోకి వలసల జోరు

### కామంచికల్‌లో బీఆర్ఎస్, సీపీఐ నుంచి 25 కుటుంబాల చేరిక

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 12, (ఆర్గాన్ న్యూస్):** కామంచికల్ గ్రామపంచాయతీ పరిధిలో బీఆర్ఎస్, సీపీఐ పార్టీలకు చెందిన 25 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. శనివారం ఖమ్మంలోని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని అన్నారు. ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను గడపగడపకూ చేరుస్తున్నామని తెలిపారు. ప్రజా పాలనకు జై.. కాంగ్రెస్‌లో చేరికలకు సై అంటూ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**కాంగ్రెస్ బలోపేతానికి కృషి**

కామంచికల్ గ్రామపంచాయతీ పరిధిలో బీఆర్ఎస్, సీపీఐ నుంచి 25 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. రానున్న రోజుల్లో మరింత మంది కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ప్రతాపనేని రఘు, మాజీ సర్పంచ్ యాదా లింగయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ మక్కా మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు ఎస్.కె. మైబు, జంగాల రామారావు, చింతకాయల వెంకన్న, బందారు నాగేశ్వరరావు, దాసరి వెంకటనారాయణ, అనంతనేని మురళి, లక్ష్మణ్, జంగం అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ అండ

### నీర్మాలలో మృతుల కుటుంబాలను పరామర్శించిన పల్లా సుందర్ రాంరెడ్డి

**దేవరుప్పుల :** దేవరుప్పుల మండలం నీర్మాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కట్టా ఐలయ్య, అలాగే అదే గ్రామానికి చెందిన నాగట్టి సిద్దయ్య ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి వారి నివాసాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యు లను పరామర్శించారు. ముందుగా మరణించిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. ఎవరూ మనోధైర్యం కోల్పోవద్దని, కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటి మల్లారెడ్డి, మేడ రామ్‌దయాకర్, మేడ చిరంజీవి, మేడ రాంచందర్, బింగి శ్రీనివాస్, వడ్లకొండ నరేష్, మేడ శ్రీను, మేడ శేఖర్, వడ్లకొండ శ్రీకాంత్‌లతో పాటు పలువురు బీఆర్ఎస్ గ్రామ శాఖ నాయకులు పాల్గొన్నారు.

## రేషన్ పంపిణీలో పారదర్శకతకే 'స్మార్ట్' కార్డులు

- ఆధునిక భద్రతా ప్రమాణాలు, క్యూఆర్ కోడ్‌తో సులభతర సేవలు
- గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి చెక్.. కాంగ్రెస్ హయాంలో సంక్షేమానికి పెద్దపీట
- దేవరుప్పులలో లబ్ధిదారులకు పంపిణీ చేసిన సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్

**దేవరుప్పుల :** ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంచడంతో పాటు, అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే దృఢ సంకల్పంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం 'స్మార్ట్ రేషన్ కార్డుల' పంపిణీకి శ్రీకారం చుట్టిందని దేవరుప్పుల సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ స్పష్టం చేశారు. దేవరుప్పుల మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ పాత కార్డుల స్థానంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆధునిక భద్రతా ప్రమాణాలతో ఈ స్మార్ట్ కార్డులను తీసుకొచ్చిందన్నారు. క్యూఆర్ కోడ్ వంటి సాంకేతిక సదుపాయాలు ఉండటం వల్ల రేషన్ సేవలు మరింత సులభతరం కావడంతో పాటు, అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకత నెలకొంటుందని వివరించారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. లబ్ధిదారులు కార్డులు అందుకున్న వెంటనే తమ వివరాలు సక్రమంగా ఉన్నాయో



లేదో పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం జరిగిందని సర్పంచ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 'ప్రజా పాలన' ద్వారా అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని గుర్తుచేశారు. ఇందులో భాగంగానే ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పేదల కోసం నూతన రేషన్ కార్డుల మంజూరుతో పాటు, ఇల్లు లేని నిరుపేదలకు 'ఇందిరమ్మ ఇళ్ల' పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నర్ర కోమలత, పంచాయతీ కార్యదర్శి సతీష్, వార్డు సభ్యులు చిలుకూరి నర్సయ్య, గోడిశాల శ్రీనివాస్, కారుపోతుల సందీప్, రమేష్, కారోబార్ వెంకట్ రెడ్డి, తదితర పంచాయతీ సిబ్బంది, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఉప్పర్ బస్తీలో పర్యటించిన మాజీ కార్పొరేటర్ డా. సామల హేమ

### చెత్త సమస్య పరిష్కారం..

### రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని అధికారులకు విజ్ఞప్తి

**సికింద్రాబాద్ :** ఉప్పర్ బస్తీ స్థానికుల ఫిర్యాదుల మేరకు మాజీ కార్పొరేటర్ డా. సామల హేమ శనివారం ఆ ప్రాంతంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వినాయక చవితి నేపథ్యంలో చెత్త పేరుకుపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన డా. సామల హేమ సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి వెంటనే చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే రాత్రి వేళల్లో కొంతమంది వ్యక్తులు మద్యం సేవించి కత్తులతో హల్‌చల్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై పోలీస్ అధికారులతో మాట్లాడిన ఆమె సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచి స్థానికులకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకురాలు గగన, స్థానికులు పాల్గొన్నారు.

## గణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

### మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సికింద్రాబాద్ :** ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్ష ణకు తమ వంతు కృషి చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పాటు ప్రమాదకర రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను పూజించి నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై పర్యావరణానికి హాని కలుగుతుందని అన్నారు.మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడిన వారమవుతామని పేర్కొన్నారు. మట్టి విగ్రహాల వినియోగంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కవాడిగూడ డీసీ పుష్పలత,



బన్సీలాల్‌పేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు నామన సంతోష్ కుమార్, కొండాపురం మహేష్ యాదవ్, మహేందర్ గౌడ్, వెంకటరమణ, లక్ష్మీపతి, గులాబ్ సింగ్, అభిషేక్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



## మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

### బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌యాదవ్

**శేరిలింగంపల్లి :** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల నేతాజీ నగర్ కాలనీలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కాలనీ అధ్యక్షులు, బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ ఆధ్వర్యంలో జి హెచ్ ఎం సీ అధికారులు ఆనంద్ డిఈ ఈ, సూపర్వైజర్స్ భరత్, రాందాస్ సహకారంతో మట్టి వినాయకులను కాలనీ ప్రజలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో పాటు రసాయన రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి కాలుష్యం పెరిగి జలచరాలు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన నీరు, స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, ఎన్ ఎన్ రెడ్డి ,కుషన్ రెడ్డి, బీసీ కులాల ఐక్యవేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ సిరిపురం హరికృష్ణ చారి, శేరిలింగంపల్లి ముదిరాజ్ సంఘం ఇంచార్జీ కొత్త మనోజ్, మార్వాడీ శంకర్, నరేష్, సురేష్ నాయక్, రంగస్వామి, బేరి చంద్రశేఖర్ యాదవ్, కృష్ణ గౌడ్, అశోక్‌తో పాటు కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

# ఓట్స్‌ను రోజూ తింటే

# అద్భుతమైన లాభాలు!

మన ఆరోగ్యానికి మేలు చేసే తృణ ధాన్యాలల్లో ఓట్స్ కూడా ఒకటి. వీటిలో బీటా గ్లూకాన్ అని పిలువబడే కరిగే ఫైబర్ తో పాటు అవెనాంత్రామైడ్స్ అని పిలువబడే యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. ఓట్స్ ను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, షుగర్ ను అదుపులో ఉంచడంలో, బరువును తగ్గించడంలో, జీర్ణశక్తిని మెరుగుపరచడంలో ఇలా అనేక రకాలుగా ఓట్స్ మనకు సహాయపడతాయి. వీటిని తరచూ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఓట్స్ ను ఆహారంగా తీసుకోవడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### కొలెస్ట్రాల్ తగ్గేందుకు..

ఓట్స్ ను తీసుకోవడం వల్ల వీటిలో ఉండే ఫైబర్ పేగుల్లో ఉండే కొలెస్ట్రాల్ ను బంధిస్తుంది. తద్వారా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. వీటిని తరచూ తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ దాదాపు 5 నుండి 10 శాతం వరకు తగ్గుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఓట్స్ ను తీసుకోవడం వల్ల కార్బోహైడ్రేట్స్ రక్తంలోకి నెమ్మదిగా ప్రవేశిస్తాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే పెరగకుండా ఉంటాయి. టైప్ 2 డయాబెటిస్ తో బాధపడే వారు ఓట్స్ ను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిల్లో హెచ్చు తగ్గులు రాకుండా ఉంటాయి. అలాగే ఓట్స్ ను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల దీనిలో ఉండే ఫైబర్ ధమనుల ఆరోగ్యానికి మద్దతును ఇస్తుంది. దీంతో సిస్టోలిక్ బిపి అదుపులో ఉంటుంది. ఓట్స్ ను 8 వారాల పాటు తీసుకోవడం వల్ల సిస్టోలిక్ బీపీ 2 నుండి 3 ఎమ్ఎమ్ హెచ్‌జి వరకు తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.





### బరువు తగ్గాలంటే..

అధిక రక్తపోటుతో బాధపడే వారు ఓట్స్ ను రోజూ తీసుకోవడం వల్ల మంచి ఫలితాలను చూడవచ్చు. ఓట్స్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి త్వరగా వేయకుండా ఉంటుంది. దీంతో మనం క్యాలరీలను తక్కువగా తీసుకుంటాం. తద్వారా శరీర బరువు అదుపులో ఉంటుంది. ఓట్స్ ను తీసుకోవడం వల్ల పేగులో మంచి బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. మలబద్ధకం సమస్య తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఓట్స్ లో మెగ్నిషియం, ఐరన్, ఫాస్పరస్, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరానికి కావల్సిన శక్తి లభిస్తుంది. ఇలా అనేక రకాలుగా ఓట్స్ మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని వీటిని తీసుకోవడం వల్ల మనం అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయని వైద్యులు తెలియజేస్తున్నారు.

# శ్రీవరి సాగు..

# లాభాలు బాగు



ఆరుతడి పంటలతో పాటు, శ్రీవరిసాగు సైతం రైతులను లాభాల బాటపట్టిస్తున్నది. కరువులో సైతం శ్రీవరిసాగుతో వరిపంటను అధికంగా దిగుబడి చేయవచ్చునని అధికారులు సూచిస్తున్నారు. శ్రీవరిసాగు పద్ధతిలో మెళుకువలు పాటిస్తే మంచి పంట దిగుబడిని పొందవచ్చని పేర్కొంటున్నారు. మండలంలో శ్రీవరి సాగును మరింత విస్తరంచేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శ్రీవరి సాగు పై మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ సూచించిన సలహాలు, జాగ్రత్తలు ఇలా ఉన్నాయి.

### శ్రీవరిసాగు పొలం తయారీ

సాధారణ వరిలాగే శ్రీవరిసాగుకు పొలం తయారు చేయాలి. వరినాటేందుకు ముందుగా కరిగట్లను సిద్ధం చేసుకుని పొలంలో ఎత్తు పల్లాలులేకుండా పొలం దున్ని సిద్ధం చేసుకోవాలి. పొలం చుట్టూ లోపలి నుంచి చిన్నచిన్న గట్లు వేసుకోవాలి. శ్రీవరిసా గులో పొలం తడిగా, బురదగా పదునుగా ఉండాలి. నీరు ఎక్కువగా నిలువ ఉండకుండా చూసుకోవాలి. నీరు ఎక్కువైతే బయటికి పోవటానికి పొలంలో చిన్నచిన్న లోతైన సేడులను ఏర్పాటు చేసుకుని నాట్లు వేయటానికి పొలం సిద్ధం చేసుకోవాలి.

### నారుమడి తయారు

శ్రీ' పద్ధతిలో వరినారును 8 నుంచి 12 రోజుల్లో నాటాలి. నారు పెంచటంలో తగిన మెళకువలు పాటించాలి. దీనికోసం రెండుకిలోల మేలిరకం విత్తనాన్ని ఒక సెంటుభూమిలో పలుచగా చల్లి, పెంచితే ఎకరా పొలంలో నాటవచ్చు. భూమిని మెత్తగా దున్ని, దుమ్ము చేసి, కొంచెం ఎత్తుగా తయారుచేసి, దానికి చుట్టు కాలువ తీయాలి. తడి మట్టి జారిపోకుండా నారుమడి చుట్టూ వరిఎండు గడ్డితో కానీ వెదురు బొంగులతో ఊతం ఏర్పాటు చేయాలి. నారుమడి తయారైన తర్వాత పశువుల ఎరువులను ఒక పొరలాగా చల్లాలి. దానిమీద 24గంటలు నానబెట్టి, మండికట్టిన విత్తనాలను పలుచగా చల్లాలి. విత్తనాలపైన పలుచగా పశువుల ఎరువులను వేసి ఉంచాలి. పై నుంచి గడ్డి కప్పి ఉంచాలి. పశువుల ఎరువును వేయాలి. పై నుంచి గడ్డి కప్పి ఉంచాలి. దానిపై రోజూ నీరు చల్లుతూ తడపాలి. ఎనిమిది రోజుల్లో వరినారు రెండు నుంచి మూడు ఆకులతో ధృఢంగా పెరుగుతుంది. నారుమడి నుంచి నారును పాతపద్ధతిలో పీకకుండా మట్టితో సహావేరు చేసి ప్లాస్టిక్ ట్రేలలో పొలానికి నారును తరలించాలి.

### వరినాట్లు వేసే విధానం

నాట్లు వేసేందుకు తయారుచేసిన పొలంలో 25పొడవు, 25 సెం.మీ. ఎడంగా ముందుగా గీతలు గీసుకోవాలి. గీతలు గీసే ప్రాంతంలో ఒక్కొక్క మొక్కను పైపైగా నాటాలి. బురద మట్టిలో సహా మొక్కలను నాటితే వాటిపై ఒత్తిడిలేకుండా స్థిరంగా బలంగా పెరుగుతాయి. మొక్కలు నాటేటప్పుడు నేల బురదపదు నుగా ఉండాలి. మొక్కలను నిటారుగా, జాగ్రత్తగా నాటితేనే పంట మంచి దిగుబడినిస్తుందని నిపుణులు సూచించారు.

### నీరు అందించే పద్ధతి

శ్రీవరిపంటకు సాగునీరందించటంలో చాలా జాగ్రత్త అవసరం. నాటిన వరి పిలకలు బాగా వచ్చేందుకు పొలం తడితడిగా పొడిపొడిగా ఉండేలా చూసుకోవాలి. మొక్కల్లో నీరు నిలువకుండా జాగ్రత్త వహించాలి. దీని కోసం ప్రతి రెండుమీటర్లకు 15-20 సెం.మీ. వెడల్పు, 15-20 సెం.మీటర్ల లోతులో సేడులు ఏర్పాటు చేసుకోవాలి. మధ్యమధ్యలో పొలం ఆరితే నీటితో తడుపుతుండాలి. దీంతో పంటవేర్లు ఆరోగ్యంగా బలపడుతాయి. పొలంచుట్టు చిన్నచిన్న ఈనెగట్లు, ఎల్లగట్లు వేసుకోవటం వలన నీటి యాజమాన్యం సక్రమంగా జరుగుతుంది. నీరును పెడుతూ తీయటంతో కలుపు వస్తుందనే భయంతో అధిక నీటిని నిలగడితే పిలకలు రాకుండా పోతాయి. పొలంలో నీటిని బట్టి నీటిని పెట్టడం, తీయటం చేయాలి. తక్కువ నీటితోనే శ్రీవరిసాగు చేయవచ్చును. మూడునాలుగు రోజులకు సాగునీరందిస్తే చాలు శ్రీవరితో అధిక దిగుబడిని పొందవచ్చును.

### కాలిబాటలు తీసే విధానం..

శ్రీవరిసాగు పద్ధతిలో ప్రతి 25సెం.మీ.నాట్లు వేయుటకు ముందుగాని 15-20 సెం.మీ. వెడల్పు 15-20 సెం.మీ.లోతులో పొలంలో పొలంలో బాటలు తీయాలి. దీని వలన గాలి, వెలుతురుతో పాటు నీరు పెట్టుకోవటానికి వీలుగా ఉంటుంది. దీంతో రైతుపొలంలో అటూఇటూ తిరిగేందుకు సైతం వీలుగా ఉంటుంది. దీంతో చీడపీడలు సైతం పంటను అంతగా ఆశించవు.

### కలుపు నివారణ

శ్రీపద్ధతిలో నీరు నిలువకుండా చూడటంతో కలుపు సమస్య అధికంగా ఉంటుంది. కలుపు నివారణకు రోటరీవీడర్‌తో నాటిన పదిరోజులకొకసారి, ఆ తర్వాత పదిరోజులకొకసారి మరో రెండు నుంచి మూడు సార్లు నేలను వీడర్‌తో ముందుకు, వెనక్కి కదిలించటంతో కలుపు మొక్కలు నేలలో కలిసిపోతాయి. రోటరీవీడర్ వాడకటం వలన వేరుకు బాగా ఆక్సిజన్ అందుతుంది. దీంతో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది స్థిరీకరిస్తాయి. దీంతో వీడర్‌ను ఉపయోగించే ముందు నీటిని అధికంగా ఉంచాలి. వీడర్‌కు మట్టి అంటుకోదు. వీడర్ తేలికగా తిరుగుతుంది. లేదంటే మిగిలిన కలుపు మొక్కలను తీసివేయాలి.

### సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

శ్రీవరిసాగులో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లిపెసర, జనుమువంటి సేంద్రియ ఎరువులను వాడటంతో భూసారం బాగా పెరుగుతుంది. పశువుల ఎరువును ఎకరానికి నాలుగు టన్నులను ఉపయోగించాలి. దీంతోపాటు వానపాముల ఎరువులను వాడాలి. రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. శ్రీవరి పద్ధతిలో 8 నుంచి 12 రోజుల్లో నారు వేర్లు బాగా అభివృద్ధి చెంది, బలంగా పెరుగుతాయి. దీంతో ముప్పై నుంచి యాభై పిలకలు వస్తాయి.



ఆర్గాన్ న్యూస్
10
తెలంగాణ
ఆదివారం
13 సెప్టెంబర్ 2026
www.organnews.in
organ.today@gmail.com
@organnews

# సాగునీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి అమోఘం

**చంద్రబాబు సారథ్యంలో ఏపీ సురక్షితం**
**అమరావతి బయో వ్యాలీకి కేంద్రం అండ**
**కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా వెల్లడి**



**విజయవాడ, సెప్టెంబర్ 12 :** రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిస్తున్న చిత్తశుద్ధి, పట్టుదల ప్రశంసనీయమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా కొనియాడారు. కేవలం ఆరోగ్య రంగంపైనే కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే కీలకమైన జలవనరులపైనా ముఖ్యమంత్రికి ఉన్న పట్టు అద్భుతమని ఆయన అన్నారు. శనివారం విజయవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ-నీవా వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు చొరవ రాష్ట్ర ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ఈ దిశగా చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పర్యటనకు వచ్చినప్పటికీ, రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించడం గమనార్హం.రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయ తలపెట్టిన క్వాంటం బయో వ్యాలీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనను జేపీ నడ్డా స్వాగతించారు. ఈ ప్రతిష్మాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుపై మరింత లోతుగా చర్చించేందుకు, అవసరమైన సూచనలు చేసేందుకు త్వరలోనే కేంద్రం నుంచి ఒక సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతామని వెల్లడించారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ఆయన విజన్ అద్భుతంగా ఉన్నాయని, వాటిని తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సంజీవని' కార్యక్రమంపై నడ్డా ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ఈ కార్యక్రమం ఒక గొప్ప ముందడుగని అభివర్ణించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని, ఈ లక్ష్యంతో పనిచేస్తున్న సంజీవని కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో అమలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సురక్షితమైన చేతుల్లో ఉందని జేపీ నడ్డా అన్నారు. చంద్రబాబు ఒక దార్శనికుడని, నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా, విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిలోనూ చంద్రబాబు పోషిస్తున్న పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన "వంటిల్లే ఫార్మసీ-ఆహారమే ఔషధం" అనే మాటను నడ్డా తన ప్రసంగంలో పలుమార్లు ప్రస్తావించారు. ఆ మాటలు నూటికి నూరు శాతం నిజమని, ఆరోగ్యానికి అదే మూల సూత్రమని వ్యాఖ్యానించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారానే వ్యాధులను దూరం చేయగలమని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాయని ఆయన స్పష్టం చేశారు.



## 19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల డిసెంబర్ కోటా విడుదల

**తిరుమల:** డిసెంబర్ నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల కోటాను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్ కోసం 21న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో ఎంపికైన భక్తులు 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లిస్తే టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, పుష్పయాగం టికెట్లను ఈ నెల 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణం టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం కోటా విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. ఈ నెల 24న ఉదయం 10 గంటలకు డిసెంబర్ నెల ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటా విడుదలవుతుంది. భక్తులు వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే సూచించింది.

### శ్రీవారి బ్రహ్మోత్సవాలు.. చంద్రబాబుకు ఆహ్వానం

తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సీఎం చంద్రబాబును తితిదే ఆహ్వానించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నివాసంలో తితిదే బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, జానకిదేవి, తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర తదితరులు సీఎంను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా తితిదే వేద పండితులు సీఎంకు వేదాశీర్వచనం అందించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితర అంశాలపై చంద్రబాబు వారితో చర్చించారు. ఈ సందర్భంగా తితిదే ఉద్యోగుల గృహస్థలాల అభివృద్ధికి సంబంధించి సీఎం చంద్రబాబుతో వీరు ప్రత్యేకంగా చర్చించారు. నిధులకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.

## కేరళం ప్రజల ఆప్యాయతకు ధన్యవాదాలు : పవన్ కల్యాణ్



**అమరావతి, సెప్టెంబర్ 12 :** కేరళంలో భుజం నొప్పికి ఆయుర్వేద చికిత్స చేయించుకుని తిరిగి వస్తున్న సందర్భంగా ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆ రాష్ట్ర ప్రజలకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కొన్ని వారాలుగా కేరళంలోని డాక్టర్ సీతారామ్ ఆయుర్వేదిక్ రీట్రీట్‌లో చికిత్స పొందిన పవన్.. అక్కడ లభించిన ఆప్యాయత, ఆతిథ్యాన్ని గుర్తు చేసుకుంటూ 'ఎక్స్' వేదికగా భావోద్వేగంతో స్పందించారు. తనకు ప్రత్యేక సంరక్షణతో నిపుణులైన వైద్య సేవలు అందించిన డాక్టర్ సీతారామ్ ఆయుర్వేదిక్ రీట్రీట్ యాజమాన్యానికి, వైద్యులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కేరళంలో బస చేయడం.. తన శరీరానికి స్వస్థతను, మనస్సుకు ప్రశాంతతను ఇచ్చిందన్నారు. చికిత్స సమయంలోనే కేరళంలోని త్రిప్రయార్ శ్రీ రామస్వామి ఆలయం, గురువాయూర్ శ్రీకృష్ణ ఆలయం, మమ్మియూర్ శ్రీ మహాదేవ ఆలయం, చెట్టికులంగర శ్రీ భగవతి అమ్మ ఆలయాలను దర్శించుకున్నట్లు తెలిపారు. శతాబ్దాల నాటి ఈ ఆలయాల సంప్రదాయాలు, కాలాతీత ఆధ్యాత్మిక వాతావరణం తనకు ఎంతో మంచి అనుభూతిని అందించాయన్నారు. భారతీయ నాగరికత వారసత్వానికి ఈ క్షేత్రాలు సజీవ ప్రతీకలని పవన్ కల్యాణ్ కొనియాడారు. తన పర్యటనలో అన్ని ఏర్పాట్లు చేసి.. సహకరించిన కేరళం ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, విపక్ష నేతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. త్రిసూర్, అలప్పుళ, కొచ్చి జిల్లాల పోలీసు బృందాలు, డీజీపి, రాష్ట్ర ప్రొటోకాల్ విభాగం అందించిన సహకారాన్ని అభినందించారు. "కేరళం ప్రజలు చూపిన ఆప్యాయత, ఆధ్యాత్మిక అనుభవాల తీపి గుర్తులతో, నిండైన కృతజ్ఞతతో వీడ్కోలు తీసుకుంటున్నాను.. ధన్యవాదాలు కేరళం" అంటూ పవన్ కల్యాణ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## పౌల్ట్రీ రంగానికి కొత్త ఊపిరి

- భారీ ప్యాకేజీతో ఊతమందించారు
- మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

**అమరావతి, సెప్టెంబర్ 12 :** రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు పూర్తి స్థాయి అండగా నిలిచేందుకు 'ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026--29'కు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలో పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసిన సందర్భంగా మాట్లాడిన మంత్రి... ఈ రంగం అభివృద్ధికి రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించామని వెల్లడించారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడమే ఈ పాలసీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా కోళ్ల ఫారాలు, హేచరీల రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ, లో-టెన్షన్ ఫారాలకు యూనిట్‌కు రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు రూ.4.75 టారిఫ్ క్రమబద్ధీకరణ కల్పించామన్నారు. కొత్త ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్ (జుజ) పౌల్ట్రీ షెడ్లకు రూ.25 లక్షల వరకు, పాత షెడ్ల ఆధునీకరణకు రూ.20 లక్షల వరకు 25 శాతం క్యాపిటల్ సబ్సిడీ అందించే అవకాశం కల్పించామని తెలిపారు. బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ ద్వారా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లను స్థాపిస్తామన్నారు. పీపీపీ విధానంలో విజయవాడ, విశాఖపట్నం, చిత్తూరు కేంద్రాలుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని, ఫీడ్ వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్రంతో చర్చించి నూక బియ్యం సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

## భవిష్యత్ టెక్నాలజీ హబ్‌గా అమరావతి

- ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ధ్యేయం
- జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్
- 49 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాకులు, పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లు
- విజయవాడ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన




**విజయవాడ, సెప్టెంబర్ 12 :** వైద్యారోగ్య రంగంలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో జనవరి 1వ తేదీ నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేస్తున్నామని, ఇది వైద్య రంగంలో ఒక గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని ప్రకటించారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం బయో వ్యాలీని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, తగిన సహకారం అందించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో వైద్యారోగ్య రంగం కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. శనివారం విజయవాడలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు వైద్యారోగ్య శాఖకు చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీని వారు సందర్శించి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభలో రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా ప్రజలకు చేరువ కానున్నాయి.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఏర్పడిన డబుల్ ఇంజన్ ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. గత 12 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కొనియాడారు. దేశంలో మెడికల్ సీట్లను 51 వేల నుంచి రెట్టింపు చేశారని, కోవిడ్ సమయంలో ప్రపంచానికే వ్యాక్సిన్ అందించి భారత్ సత్తా చాటారని గుర్తుచేశారు. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు తక్కువ ధరకే మందులు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఫార్మా రంగం దేశానికే తలమానికంగా ఉందని, మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని వివరించారు.ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సీఎం సూచించారు. "వంటశాలనే ఫార్మసీగా, ఆహారాన్నే ఔషధంగా" భావించాలని పిలుపునిచ్చారు. యోగా, ప్రాణాయామం వంటి సంప్రదాయ పద్ధతులను పాటిస్తూనే, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలుపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. 'హెల్తీ-వెల్తీ-హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నిర్మాణమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు.అమరావతిని భవిష్యత్ సాంకేతికతకు చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను అమరావతిలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అమరావతి గురించి లద్దాఖ్‌లో కూడా చర్చించుకునే పరిస్థితి వచ్చిందని, భవిష్యత్తులో ప్రపంచమంతా అమరావతి వైపు చూస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమ, సోము వీర్రాజు సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం ప్రసంగం సందర్భంగా ప్రధాని మోదీ, అమరావతి, సంజీవని ప్రాజెక్టుల గురించి ప్రస్తావించినప్పుడు సభికులు, వైద్య విద్యార్థులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగిశాక సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నడ్డాతో కలిసి వేదికపై నుంచే సెల్ఫీ తీసుకుని సభికులను ఉత్సాహపరిచారు.

## 253 కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్

- అమరావతిలోని తుళ్లూరులో నిర్మాణం
- ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడి

**అమరావతి, సెప్టెంబర్ 12 :** రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీలు పోలీసు నేర పరిశోధనకు వెన్నుముక లాంటివని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఈరోజు రాజమండ్రిలో పర్యటించిన ఆయన... రాజధాని అమరావతిలోని తుళ్లూరులో రూ.253 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద స్టేట్ లెవల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రాజమండ్రి, తిరుపతి, అనంతపురం, విశాఖ సహా పలు కేంద్రాల్లో ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. డీఎన్ఏ నివేదికలను ప్రస్తుతం 7 రోజుల్లోనే, అత్యంత కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే అందిస్తున్నామని చెప్పారు. అలాగే, సైబర్ నేరాల నియంత్రణకు జిల్లా స్థాయిలో 'క్లిక్' కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజమండ్రి గోదావరి పుష్కరాల సందర్భంగా రద్దీ నివారణకు అధునాతన డ్రోన్లు, రికార్డింగ్ మోడ్‌లోని సీసీటీవీల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ పేర్కొన్నారు.

## బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం

- జగన్ ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసింది
- ఆంధ్రప్రదేశ్ మంత్రి సవిత కీలక వ్యాఖ్యలు
- 'బీసీ రక్షణ చట్టం' అవగాహన సదస్సు



**అమరావతి, సెప్టెంబర్ 12 :** బీసీల ఆత్మగౌరవ జీవనమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి సవిత స్పష్టం చేశారు. విజయవాడ సమీపంలోని ఉన్న గొల్లపూడి బీసీ భవన్‌లో నిర్వహించిన 'బీసీ రక్షణ చట్టం' అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యపడుతుందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో 'బీసీ రక్షణ చట్టం' తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు. బీసీలను కులం లేదా వృత్తుల పేరుతో దూషించినా, సంఘ బహిష్కరణకు గురిచేసినా కఠిన శిక్షలు పడేలా జిల్లాల్లో ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి, 2 నెలల్లోనే విచారణ పూర్తిచేసేలా పక్కా నిబంధనలు రూపొందించామని స్పష్టం చేశారు. ఈ చట్టం కోర్టులలో బలంగా నిలబడేలా 156 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకున్నామన్నారు. గత జగన్ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి ద్రోహం చేసిందని మంత్రి విమర్శించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తుందని ప్రకటించారు. అంతేకాకుండా చేతివృత్తుల వారికి ఊతమిచ్చే 'ఆదరణ 3.0' పథకాన్ని కూడా త్వరలోనే అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చారు.

## నా డ్యాన్స్‌తో ఉన్న ఏఐ వీడియో చూసి ఆశ్చర్యపోయా

**కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ సరదా వ్యాఖ్య**

**కేరళ, సెప్టెంబర్ 12 :** కేఎస్ఈబీ ఉద్యోగులతో కలిసి తాను నృత్యం చేస్తున్నట్లుగా ఉన్న ఒక కృత్రిమ మేధ (ఏఐ) వీడియోను చూసి దిగ్భ్రాంతికి గురయ్యానని కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అన్నారు. అయితే, ఆ టెక్నాలజీ పుణ్యమా అని తాను ప్రముఖ నటులు మోహన్‌లాల్, సీఎం విజయ్ కంటే మెరుగ్గా డ్యాన్స్ చేశానని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. శనివారం కేరళ జ్యుడీషియల్ అకాడమీ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో సతీశన్ ప్రసంగించారు. సినిమా, సంగీత రంగాల్లో కాపీరైట్ హక్కుల పరిరక్షణ, డిజిటల్ టెక్నాలజీ సవాళ్లు అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తన అనుభవాన్నే ఉదాహరణగా చూపుతూ, "ఆ వీడియో చూసి నేను షాక్ అయ్యాను. అందులో నేను మోహన్‌లాల్, విజయ్ కంటే బాగా డ్యాన్స్ చేస్తున్నట్లు అనిపించింది" అని సాంకేతిక పరిజ్ఞాన వేగానికి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేరళ తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటూ, ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న సమయంలో ఈ ఏఐ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇటీవల విడుదలైన 'జైలర్ 2' చిత్రంలోని 'అల బొలెలో' పాటకు సతీశన్, కేఎస్ఈబీ ఉద్యోగులు డ్యాన్స్ చేస్తున్నట్లు ఈ వీడియోను రూపొందించారు. కేవలం వినోదం కోసమే దీనిని రూపొందించామని, ఎవరినీ అవమానించే ఉద్దేశం లేదని క్రియేటర్లు స్పష్టం చేశారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియోను కోటి మందికి పైగా వీక్షించడం విశేషం. ఈ వీడియోపై నెటిజన్లు స్పందిస్తూ విద్యుత్ కోతలపై ప్రభుత్వంపై, కేఎస్ఈబీపై విమర్శలు గుప్పిస్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి అతీంద్రియ శక్తులేమీ కారణం కాదని, రాత్రిపూట వినియోగం పెరగడమే ప్రధాన కారణమని మంత్రి సన్నీ జోసెఫ్ పేర్కొన్న తరుణంలో సతీశన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## అమీర్‌పేట్‌లో యువతి మృతి



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** సెల్‌ఫోన్ రిపేర్ కోసం వచ్చిన ఓ యువతి రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ ఘటన హైదరాబాద్ అమీర్‌పేట శ్రీనగర్ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన వి.హేమదుర్గ (26) ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ బంజారాహిల్స్‌లోని ఓ కార్ల కంపెనీలో పనిచేస్తోంది. తన సెల్‌ఫోన్ రిపేర్ కోసం ఆఫీస్‌లో పర్మిషన్ తీసుకుని అమీర్‌పేటకు ర్యాపిడో బైక్‌పై బయలుదేరింది. అమీర్‌పేట బిగ్‌బజార్ వెనుక గేట్ సమీపంలోకి రాగానే ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో హేమదుర్గ అక్కడికక్కడే మృతిచెందింది. బస్సు డ్రైవర్ షేక్ అన్వర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పంజాగుట్ట పోలీసులు తెలిపారు.

# ఒరాకిల్‌లో మళ్లీ లేఆఫ్స్..




ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్ మళ్లీ ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోంది. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి దాదాపు 700 మిలియన్ డాలర్లు (రూ.6,688 కోట్లు) వెచ్చించనున్నట్లు తెలుస్తోంది. ఏఐ డేటా సెంటర్ల కోసం అధిక నిధులను కేటాయించడమే ఈ కోతలకు కారణం. ఈ ఏడాదిలో ఇప్పటికే దాదాపు 20 వేలకు పైగా ఉద్యోగులను కంపెనీ తొలగించడం గమనార్హం. సంస్థ కార్యకలాపాల్లో కృత్రిమ మేధను భాగం చేయడానికి ఒరాకిల్ అధికంగా ఖర్చు చేస్తోంది. దీంతో ఆర్థిక పరమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. ఈ ఏడాది కంపెనీ కర్యాకలాపాల పునర్నిర్మాణంలో భాగంగా దాదాపు 2.8 బిలియన్ డాలర్లు (రూ.26.7 వేల కోట్లు) కేటాయించింది. ఇందులో అధిక భాగం ఉద్యోగాల కోతకే నిధులు వెచ్చించింది. ఇప్పటికే 2.1 బిలియన్ డాలర్లను కేటాయించగా.. మరోసారి ఉద్యోగాల కోతకు అదనంగా 700 మిలియన్ డాలర్లను కేటాయిస్తోంది. కంపెనీ నిర్వహణ ఖర్చులను తగ్గించుకొని, లాభాల మార్జిన్లను కాపాడుకోవడానికి ఉద్యోగాల కోతలు చేపడుతోంది. ప్రపంచవ్యాప్తంగా మే నాటికి ఒరాకిల్‌లో 1,41,000 మంది ఉద్యోగులు ఉన్నారు.






# జొమాటో మరో షాక్..

## క్యాష్ ఆన్ డెలివరీపై ఫీజు

ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో మరో షాకిచ్చింది. క్యాష్ ఆన్ డెలివరీలపై అదనంగా రూ.5 ఛార్జీ వసూలు చేస్తోంది. ఇప్పటికే కంపెనీ బిల్ సమ్మరీలో ఈ ఛార్జీలు కనిపిస్తున్నాయి. ఆదాయాన్ని మెరుగుపరుచుకోవడం, డిజిటల్ పేమెంట్ల వైపు వినియోగదారులను మళ్లించేందుకు కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫుడ్ ఆర్డర్లపై ప్లాట్‌ఫాం ఫీజు, రెస్టరెంట్ ప్యాకేజింగ్ ఛార్జీలు, జీఎస్టీని జొమాటో వసూలు చేస్తుంది. దీనికి సీఓడీ ఛార్జీలు అదనపు భారం. ఆన్‌లైన్ పేమెంట్లు చేసే కస్టమర్లకు ఈ ఛార్జీలు వర్తించవు. కాగా, జొమాటో ఇటీవలే తన ప్లాట్‌ఫాం ఫీజును పెంచిన విషయం తెలిసిందే. వినియోగదారుడి ఒక్కో ఆర్డర్‌కు ఫీజును రూ.12.50 నుంచి రూ.14.90కి సవరించింది. ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ తీవ్రమవుతోంది. ర్యాపిడో ఓన్లీ, ఫ్లిప్‌కార్ట్ ఈట్ ఇన్ ఫుడ్ డెలివరీ సేవలను ప్రయోగత్మకంగా ప్రారంభించాయి. దీంతో ఈ రంగంలో ఉన్న జొమాటో, స్విగ్గీకి గట్టి పోటీ ఎదురవుతోంది. కంపెనీ లాభాల్ని పెంచుకోవడానికి జొమాటో సీఓడీ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.




# ఫాస్టాగ్ వినియోగదారులకు శుభవార్త

ఫాస్టాగ్ వినియోగదారులకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఇకపై ఫాస్టాగ్‌కు అనుసంధానమైన బ్యాంకును మార్చుకోవాలంటే.. వాహనంపై ఉన్న ట్యాగ్‌ను తొలగించి కొత్తది తీసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. 'వన్‌ట్యాగ్' విధానాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ముంబయిలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో ప్రారంభించారు. మొబైల్ నంబర్ పోర్టబిలిటీ తరహాలో ఈ సేవ పనిచేస్తుంది. ప్రస్తుత బ్యాంకు సేవలు నచ్చకపోతే మరో బ్యాంకుకు ఫాస్టాగ్ ఖాతాను మార్చుకోవచ్చు. వాహనంపై ఉన్న ట్యాగ్ మాత్రం అలాగే ఉంటుంది. ఈ మార్పు ప్రక్రియను రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ సహా పలు సంస్థలు ఇప్పటికే ఈ విధానంలో భాగమయ్యాయి. ఫాస్టాగ్ సేవల మార్పులో వాహనదారులకు ఎదురవుతోన్న ఇబ్బందులను తగ్గించడమే వన్‌ట్యాగ్ విధానం లక్ష్యమని గడ్కరీ తెలిపారు. గతంలో బ్యాంకు మార్చాలంటే పాత ఫాస్టాగ్ ఖాతాను మూసివేసి.. కొత్త ట్యాగ్ తీసుకోవాల్సి వచ్చేదని పేర్కొన్నారు.

1. ప్లే స్టోర్ నుంచి రాజ్‌మార్గ్‌యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ అవ్వాలి.
2. యాప్‌లో ఫాస్టాగ్/వన్‌ట్యాగ్ సేవను ఎంచుకోవాలి.
3. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్ వివరాలు నమోదు చేయాలి.
4. బ్యాంకు మార్చే ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
5. కొత్తగా ఎంచుకున్న బ్యాంకును ఎంపిక చేసి.. అవసరమైన వివరాలు సమర్పించాలి.
6. ధ్రువీకరణ పూర్తయిన తర్వాత ఫాస్టాగ్ కొత్త బ్యాంకుకు పోర్ట్ అవుతుంది. తదనంతరం వాహనంపై ఉన్న పాత ట్యాగ్‌నే కొనసాగించవచ్చు.



# 40 ఏళ్లకు ఉద్యోగం మానేస్తే ఈపీఎఫ్ఓ నిధులపై వడ్డీ వస్తుందా?

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ గురించి చాలా మందికి అపోహ ఉంటుంది. ఏదైనా కారణంతో ఉద్యోగం మధ్యలోనే వదిలేస్తే ఈపీఎఫ్ఓ ఖాతాలో ఉన్న నిధులపై వడ్డీ నిలిచిపోతుందని భావిస్తుంటారు. దీంతో ఉద్యోగం మానేసిన వెంటనే ఖాతాలోని నిధులను ఉపసంహరించుకోవడంతో చక్రవడ్డీ ప్రయోజనం కోల్పోతుంటారు. భవిష్య నిధి సంస్థ దీనిపై స్పష్టతనిస్తూ తాజాగా ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టింది. కుటుంబ అవసరాల కోసమో, ఇతర కారణాల వల్లో చాలామంది ఉద్యోగ జీవితానికి స్వస్తి పలుకుతుంటారు. ఒకవేళ 40 ఏళ్ల వయసులో ఉద్యోగం మానేస్తే అప్పటి వరకు జమ అయిన నిధులకు వడ్డీ వస్తుందా? రాదా? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈపీఎఫ్ఓ స్పష్టతనిచ్చింది. ఉద్యోగం మానేసినా 58 ఏళ్ల వయసు వరకు నిధులపై వడ్డీ వస్తుందని వెల్లడించింది. ఖాతా ఇన్‌ఆపరేటివ్‌గా మారనంత వరకు వడ్డీ ప్రయోజనం లభిస్తుందని పేర్కొంది.

## ఇన్‌ఆపరేటివ్ ఎప్పుడవుతుంది?

ఈపీఎఫ్ఓ నిబంధనల ప్రకారం.. ఉద్యోగి 55 ఏళ్లు, ఆ తర్వాత రిటైర్ అయితే ఆ తేదీ నుంచి 36 నెలల (3 ఏళ్లు) వరకు ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేకపోతే ఆ ఖాతా ఇన్-ఆపరేటివ్‌గా మారుతుంది. ఖాతా ఇన్‌ఆపరేటివ్ అయిన తర్వాత వడ్డీ రావడం ఆగిపోతుంది. 55 ఏళ్ల కంటే ముందే ఉద్యోగం మానేసిన సందర్భాల్లో 58 ఏళ్లు నిండేంత వరకు ఆ ఖాతా ఇన్‌ఆపరేటివ్ కాదు. కాబట్టి వడ్డీ కొనసాగుతుంది. చందాదారుడు విదేశాలకు పూర్తిగా వలస వెళ్లిన, మరణించిన సందర్భాల్లోనూ ఖాతా ఇన్‌ఆపరేటివ్‌గా అవుతుంది.

## వడ్డీ ఎందుకు కీలకం?-

విశ్రాంత జీవితంలో ఆర్థికంగా ఇబ్బందులు రాకుండా అవసరమైన మొత్తాన్ని కూడబెట్టుకునే అవకాశం కల్పిస్తోంది ఈపీఎఫ్ఓ. ఇందులో నిధులు ఉపసంహరిస్తే వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈపీఎఫ్‌పై 8.25 శాతం వడ్డీ లభిస్తోంది. ఏటా వడ్డీ అసలులో కలుస్తుంది. దీంతో చక్రవడ్డీ తరహాలో ఆదాయం వస్తుంది. ఇలా వచ్చిన మొత్తంపై ఆదాయ పన్ను చెల్లించనక్కర్లేదు. ఇవన్నీ కలిపితే సుమారు 9.5-10 శాతం వరకు రాబడి అందుతుంది. కాబట్టి దీర్ఘకాలంలో మంచి నిధిని కూడబెట్టాలనుకునేవారికి ఈపీఎఫ్ఓ సరైన ఎంపిక. ఎలాంటి ఆర్థిక ఇబ్బందులూ లేకపోతే ఈపీఎఫ్ఓ నిధులను ముట్టుకోకుండా ఉంటే చక్రవడ్డీ ప్రయోజనం పొందొచ్చు.






# ఇంగ్లాండ్ గడ్డపై పాక్‌కు ఘోర పరాభవం..

## మూడో టెస్టులోనూ పాకిస్థాన్‌కు ఓటమి

ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్ జట్టు 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసి పాకిస్థాన్‌కు ఘోర పరాభవాన్ని మిగిల్చింది. కెప్టెన్‌గా జో రూట్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తర్వాత తొలి సిరీస్‌నే క్లీన్ స్వీప్ చేయడం గమనార్హం. తొలి రెండు టెస్టులతో పోలిస్తే.. మూడో టెస్టులో పాక్ కాస్త పోరాడినా ఓటమిని మాత్రం తప్పించుకోలేకపోయింది. దీంతో నాలుగు రోజుల్లోనే టెస్ట్ మ్యాచ్ ముగిసింది. 130 పరుగుల స్వల్ప లక్ష్యంతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్‌కు పాకిస్థాన్ పేసర్ మహమ్మద్ అబ్బాస్ షాక్ ఇచ్చాడు. తొలి బంతికే డకెట్‌ను డకౌట్‌గా వెనక్కి పంపిన అబ్బాస్, అదే ఓవర్లో ఎమిలియో గేని కూడా పెవిలియన్ చేర్చాడు. కేవలం 2 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఇంగ్లాండ్‌పై పాక్ పైచేయి సాధించినట్లు కనిపించింది. అబ్బాస్ తన కట్టుదిట్టమైన స్పెల్‌తో ఇంగ్లాండ్ బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. అయితే కెప్టెన్ జో రూట్, జోర్డాన్ కాక్స్ కలిసి ఇంగ్లాండ్‌ను ఆదుకున్నారు. పాకిస్థాన్ బౌలర్ల దాడిని తట్టుకుంటూ నెమ్మదిగా స్కోరు బోర్డును ముందుకు నడిపారు. ఈ క్రమంలో పాకిస్థాన్ చేసిన పొరపాట్లు రూట్‌కు బాగా కలసివచ్చాయి. మహమ్మద్ అలీ బౌలింగ్‌లో రూట్ బంతిని వికెట్లపైకి ఆడుకున్నప్పటికీ అది నో-బాల్ కావడంతో బ్రతికిపోయాడు. ఆ తర్వాత స్లిప్‌లో క్యాచ్ డ్రాప్ అవ్వడంతో లభించిన అవకాశాలను రూట్ పూర్తిగా సద్వినియోగం చేసుకుని అజేయ హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించాడు. ఒత్తిడిని జయించిన జో రూట్, జోర్డాన్ కాక్స్ మూడో వికెట్‌కు 100కు పైగా పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కాక్స్ కూడా తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకుని ఇంగ్లాండ్ విజయాన్ని ఖరారు చేశాడు. చివరికి 24.2 ఓవర్లలో 130/2 పరుగులు చేసిన ఇంగ్లాండ్ సునాయాస విజయాన్ని అందుకుంది. ఈ ఓటమితో పాకిస్థాన్ ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలు గల్లంతయ్యాయి. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 133 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం ఇంగ్లాండ్ 453 పరుగులు చేసింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో పాక్ బ్యాటర్లు పోరాడారు. దీంతో ఈ సిరీస్‌లోనే తొలిసారి ఆ జట్టు స్కోరు 200 పరుగుల మార్కును దాటింది. చివరకు 449 పరుగులకు ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఆలౌట్ అయింది. అనంతరం 130 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్.. 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి.. సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది.

# హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా సిరాజ్




రంజీ ట్రోఫీ కొత్త సీజన్‌కు హైదరాబాద్ జట్టు కొత్త ఉత్సాహంతో సిద్ధమవుతో ంది. భారత స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు జట్టు పగ్గాలు అప్పగించింది హైదరాబాద్ క్రికెట్ అసోసియే షన్ (హెచ్‌సీఏ). 2026-27 సీజన్‌లో హైద రాబాద్‌కు సిరాజ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. చామా మిలింద్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. అక్టోబర్ 11 నుంచి రంజీ ట్రోఫీ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో త్రిపురతో హైదరాబాద్ తలపడనుంది. హైదరాబాద్ ఎలైట్ గ్రూప్-బిలో ఉంది. సౌరాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అసోం, త్రిపుర ఈ గ్రూపులో ఉన్నాయి. ఇటీవల శ్రీలంక పర్యట నలో సిరాజ్ ఆశించిన స్థాయిలో వేగం చూపలేకపోయాడు. సాధారణంగా గంటకు 140 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు వేసే అతడు.. అక్కడ 120 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేశాడు. రెండు మ్యాచ్‌ల్లో 44 ఓవర్లు వేసి నాలుగు వికెట్లు తీసుకున్నాడు. రెండు నెలల విరామం తర్వాత నేరుగా మ్యాచ్ ఆడటంతో తన బౌలింగ్ లయ దెబ్బతిన్నట్లు సిరాజ్ తెలిపాడు. రన్‌అప్‌లో అడుగులు సరిగ్గా పడకపోవడంతో వేగం తగ్గిందని చెప్పాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో మాత్రం సిరాజ్ తిరిగి లయ అందుకున్నాడు. శ్రీలంక నుంచి వచ్చిన కొన్నిరోజులకే చెన్నై మ్యాచ్ ఆడినా.. దేశం తరఫున ఆడేట ప్పుడు సాకులు చెప్పకూడదని స్పష్టం చేశాడు. జట్టు కోసం పూర్తి స్థాయిలో కష్టపడటమే తనకు ముఖ్యమని చెప్పాడు. ఇప్పుడు హైదరాబాద్ కెప్టెన్‌గా సిరాజ్ ముందు మరో సవాలు ఉంది. నాయకత్వంతో పాటు బంతితోనూ సత్తా చాటేందుకు అతడికి రంజీ సీజన్ మంచి అవకాశం కానుంది.

# నేడు ఆఫ్ఘనిస్తాన్‌తో టీమిండియా టీ20 మ్యాచ్

## సవాల్‌గా మారిన తుది జట్టు ఎంపిక




శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టు ఇటీవలే జింబాబ్వే పర్యటనను దిగ్విజయంగా ముగించుకుంది. ఈ సిరీస్ ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లాండ్ లల్లో చవి చూసిన పరిపూర్ణ ఓటముల గాయాన్ని జింబాబ్వే సిరీస్ కొంతవరకు నయం చేయగలిగింది. ఇక.. మూడు టీ20 మ్యాచ్ ల సిరీస్ ఆడబోతోంది. ఆఫ్ఘనిస్తాన్ తో తలపడబోతోంది. ఈ మూడు మ్యాచ్ లకు ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియం ఆతిథ్యాన్ని ఇస్తోంది. అన్ని మ్యాచ్‌లు రాత్రి 7:30 గంటలకు ప్రారంభమౌతాయి. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న టీమిండియా.. జింబాబ్వేపై సాధించిన విజయ పరంపరను కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. తుది జట్టును ఎంపిక చేయడం పెద్ద సవాల్‌గా మారింది. స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ జట్టులోకి తిరిగి రావడంతో ఈక్వేషన్లు మారాయి. జింబాబ్వే పర్యటనకు దూరమైన శాంసన్ ఇప్పటివరకు ఆడిన 14 మ్యాచ్‌ల్లో 180.99 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 400 పరుగులు సాధించాడు. ఇందులో మూడు అర్ధ సెంచరీలు ఉన్నాయి. టీమిండియా ఓపెనింగ్ స్థానం కోసం గట్టి పోటీ నెలకొంది. జింబాబ్వే సిరీస్‌లో వరుసగా రెండు హాఫ్ సెంచరీలు సాధించి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అందుకున్న వైభవ్ సూర్యవంశీ వైపే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపే అవకాశం ఉంది. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ ప్రస్తుత ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. గత మూడు మ్యాచ్‌ల్లో అతను కేవలం 11 పరుగులు మాత్రమే చేశాడు. మొదటి మ్యాచ్‌లో అభిషేక్ రాణించకపోతే, మిగిలిన రెండింటికీ సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా పంపే అవకాశం ఉంది. వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కూడా ఓపెనర్ రేసులో ఉన్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్‌పై 270 పరుగుల రికార్డు ఇన్నింగ్స్‌తో ఇషాన్ తన ఫామ్‌ను నిరూపించుకున్నాడు. దీంతో అతను నాలుగో స్థానంలో ఆడే అవకాశాలు ఉన్నాయి. ఇక మిడిల్ ఆర్డర్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ జట్టుకు వెన్నెముకగా నిలవనున్నారు. ఆల్‌రౌండర్ కోటాలో ఎవరిని ఎంపిక చేయాలనే దానిపై తర్జన భర్జన జరుగుతోంది. శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిల్లో ఒకరికి అవకాశం దక్కొచ్చు. ఎవరిని ఆడిస్తారనేది పిచ్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. బ్యాటింగ్ డెప్త్ పెంచాలనుకుంటే దూబే వైపు, బౌలింగ్ ఆప్షన్ వైపు మొగ్గు చూపితే నితీష్ రెడ్డిని ఎంపిక చేసే అవకాశం ఉంది. బౌలింగ్ విభాగంలో మేనేజ్‌మెంట్ జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌పై దృష్టి సారించింది. అర్షదీప్ సింగ్, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ ఈ మ్యాచ్ లో కీలకం కానున్నారు.

# చెన్నై యాజమాన్యం క్లారిటీతో తెరపడిన ఉత్కంఠ




చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో ధోనీ వాటాలు కోరారనే ప్రచారం క్రీడా వర్గాల్లో పెద్ద ఎత్తున కలకలం రేపింది. ఈ ఊహాగానాలపై సీఎస్కే యాజమాన్యం అధికారికంగా స్పందిస్తూ స్పష్టత ఇచ్చింది. అదే సమయంలో కొత్త కోచ్ ఎంపిక, రాబోయే ఐపీఎల్ వ్యూహాలపై కూడా కీలక సమాచారం వెలువడింది. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో వాటాలను కొనుగోలు చేయడానికి ధోనీ ఆసక్తి చూపించారని, అయితే ఆయన పెట్టిన షరతులకు యాజమాన్యం అంగీకరించలేదని కొన్ని వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ ప్రచారంపై సీఎస్కే పెద్ద అధికారి ఒకరు తీవ్రంగా స్పందించారు. ధోనీ నుంచి అలాంటి ప్రతిపాదన ఏది తమ వద్దకు రాలేదని, ఆయనతో దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదని స్పష్టం చేశారు. ఎన్ శ్రీనివాసన్‌తో ఆయన వ్యక్తిగతంగా మాట్లాడారో లేదో తమకు తెలియదని వివరించారు. గతంలో సీఎస్కే షేర్లు ప్రైవేట్ విక్రయానికి అందుబాటులో ఉన్న సమయంలో ధోనీ కొన్ని షేర్లను కొనుగోలు చేసిన మాట నిజమేనని ఫ్రాంచైజీ వర్గాలు వెల్లడించాయి. ఈ షేర్లు బహిరంగ మార్కెట్లో విక్రయించబడవు కాబట్టి ప్రైవేట్‌గానే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ధోనీ వద్ద లక్షకు పైగా షేర్లు ఉన్నప్పటికీ, మొత్తం ఫ్రాంచైజీ వాటాతో పోలిస్తే అది చాలా చిన్న భాగం మాత్రమే. ప్రస్తుతం శ్రీనివాసన్ కుటుంబం వద్దే 55 శాతానికి పైగా ప్రైవేట్ వాటాలు భద్రంగా ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ధోనీ సెప్టెంబర్ 22 నాటికి భారత్‌కు తిరిగి రానున్నారు. ఆయన స్వదేశానికి చేరుకున్న వెంటనే ఐపీఎల్ 2027 వేలానికి సంబంధించి, అలాగే ఆటగాళ్ల ట్రేడింగ్, బదిలీలపై సీఎస్కే యాజమాన్యం ఒక కీలక సమావేశం నిర్వహించనుంది. ప్రధానంగా సీఎస్కే కొత్త హెడ్ కోచ్ ఎంపికలో ధోనీ పాత్ర అత్యంత కీలకం కానుంది. ఒక విదేశీ దిగ్గజ ఆటగాడిని కోచ్‌గా నియమించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అభిమానుల్లో ఎన్నో సందేహాలు ఉన్నప్పటికీ ధోనీ, సీఎస్కే బంధం ఎప్పటిలాగే బలంగా ఉంది. సెప్టెంబర్ చివరి వారంలో జరగబోయే సీఎస్కే సమావేశం తర్వాత కొత్త కోచ్ ఎవరనే దానిపై పూర్తి స్పష్టత రానుంది.

# 309 ఇన్నింగ్స్‌ల్లో 69వ అర్ధశతకం

## చరిత్ర సృష్టించిన ఇంగ్లాండ్ కెప్టెన్ రూట్



రెడ్ బాల్ క్రికెట్‌లో ఇంగ్లాండ్ రన్‌మెషీన్ జో రూట్ తన సూపర్ ఫామ్ కొనసాగిస్తూ సరికొత్త చరిత్ర సృష్టించాడు. టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యధిక అర్ధశతకాలు సాధించిన బ్యాటర్‌గా టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ వరల్డ్ రికార్డును రూట్ బద్దలు కొట్టాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ బాదడం ద్వారా రూట్ తన కెరీర్‌లో 69వ టెస్టు ఫిఫ్టీని నమోదు చేసుకున్నాడు. సచిన్ టెండూల్కర్ 329 ఇన్నింగ్స్‌ల్లో 68 ఫిఫ్టీలు సాధించగా, రూట్ కేవలం 309 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మార్కును దాటేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో జో రూట్ మరో భారీ మైలురాయిని చేరుకున్నాడు. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో 1000 ప్లస్ టెస్టు పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా చరిత్ర పుటలకెక్కాడు. ఒకే వేదికపై నిలకడగా పరుగులు రాబడుతూ ప్రత్యర్థి బౌలర్లకు సింహస్వప్నంగా మారిన రూట్, ఈ మైదానంలో ఇంగ్లాండ్‌కు అనేక చారిత్రాత్మక విజయాలను అందించడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగు వేర్వేరు క్రికెట్ వేదికల్లో 1000 కంటే ఎక్కువ టెస్టు పరుగులు సాధించిన ప్రపంచంలోనే మూడో క్రికెటర్‌గా జో రూట్ నిలిచాడు. గతంలో లార్డ్స్ (2203 రన్స్), మాంచెస్టర్ (1128 రన్స్), ది ఓవల్ (1050 రన్స్) మైదానాల్లో వెయ్యికి పైగా పరుగులు చేసిన రూట్, ఇప్పుడు ఎడ్జ్‌బాస్టన్ (1000 రన్స్)ను కూడా ఆ జాబితాలో చేర్చాడు. క్రికెట్ చరిత్రలో దక్షిణాఫ్రికా దిగ్గజం జాక్వెస్ కల్లిస్, ఆస్ట్రేలియా గ్రేట్ రికీ పాంటింగ్ మాత్రమే ఈ ఘనత సాధించగా, ఇప్పుడు రూట్ వారి సరసన నిలిచాడు. కాగా పాకిస్థాన్‌తో జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్.. 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఇక ఇంగ్లాండ్, పాకిస్థాన్ టెస్ట్ సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఇంగ్లాండ్‌కు చెందిన ఓలీ రాబిన్సన్, పాక్ పేసర్ మహమ్మద్ అబ్బాస్ నిలిచారు.



# ‘ఆదర్శ కుటుంబం’ టీజర్ వచ్చేసింది..

వెంకటేశ్ త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘ఆదర్శ కుటుంబం – హౌస్ నెం.47’. వెంకటేశ్‌కు జోడీగా శ్రీనిధిశెట్టి నటించిన ఈ సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా టీజర్‌ను విడుదల చేశారు. ఎప్పటిలానే వెంకటేశ్ ఫ్యామిలీ నవ్వులు పూయిస్తోంది.






# ‘ఎపిక్’పై రష్మిక ప్రశంసలు

హీరో ఆనంద్ దేవరకొండ, నటి వైష్ణవి చైతన్య జంటగా నటించిన తాజా చిత్రం ‘ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్’. ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా సెప్టెంబరు 11న థియేటర్లలో విడుదలైంది. తాజాగా ఈ రొమాంటిక్ డ్రామాపై స్టార్ హీరోయిన్ రష్మిక ప్రశంసలు కురిపించారు. ఈ సినిమాను ప్రతి ఒక్కరూ థియేటర్లలోనే చూడాలని కోరారు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ వేదికగా ‘ఎపిక్’ చిత్రంపై రష్మిక తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. “ఈ రోజు ‘ఎపిక్’ సినిమా విడుదలైంది. మీరంతా ఈ చిత్రాన్ని థియేటర్లలోనే చూస్తారని ఆశిస్తున్నా. ఆనంద్, ఆదిత్య, వైష్ణవి ఈ చిత్రంలో భిన్నమైన, ముఖ్యమైన, ప్రస్తుత సమాజానికి అవసరమైన అంశాలను చూపించారు. అదే సమయంలో వినోదానికీ ఏమాత్రం లోటు లేకుండా చేశారు. మీ టీమ్‌ని చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. దేవుడి ఆశీస్సులు మీకు ఎప్పుడూ ఉంటాయి” అని రష్మిక పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# నా సినిమాలను నేను చూడలేను



ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె ‘వైబ్’ అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు ‘బట్వారా 1947’ చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. ‘వైబ్’లో ఆమె ‘మేడమ్ హెచ్’ అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు ‘ఇంపాస్టర్ సింద్రోమ్’ అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు ‘చేయగలనా, లేదా?’ అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. “నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది” అని ప్రీతి వెల్లడించింది.

# తెలుగులోకి ‘హనుమాన్ అంశ్’

రూ. 2 కోట్లతో తీసిన సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 150 కోట్లకు పైగా కలెక్ట్ చేసిందంటే ఎవరైనా షాక్ అవ్వాల్సిందే. అది కూడా ఎలాంటి స్టార్ కాస్ట్, ప్రమోషన్లు, అంచనాలు లేకుండా సైలెంట్ బాలీవుడ్ లో రిలీజ్ అయిన ఓ చిన్న సినిమా గురించి ఇప్పుడు యావత్ దేశం మొత్తం మాట్లాడుకుంటుంది. అదే “హనుమాన్ అంశ్” చిత్రం.. ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నారు.త్రివిక్రమ్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 18 న తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేయనుంది.



# రామ్ సినిమాలో సంయుక్త కథానాయిక



రామ్ పోతినేని కథానాయకుడిగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందిస్తున్నారు. కృష్ణ పోతినేని నిర్మాత. ఇందులో సంయుక్త కథానాయికగా నటిస్తోంది. ఈ విషయాన్ని శుక్రవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇదో విభిన్నమైన నియో–నోయిర్ సైకలాజికల్ థ్రిల్లర్. రామ్ ఇందులో వీర అనే శక్తిమంతమైన పాత్రలో.. సరికొత్త లుక్‌తో అలరించనున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ సినిమాకి సామ్ సీఎస్ సంగీతమందిస్తుండగా.. తిరునావుక్కరసు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇక మరోవైపు సంయుక్త పుట్టినరోజు సందర్భంగా ‘స్వయంభూ’, ‘స్లమ్ డాగ్’, ‘హైందవ’, ‘ది బ్లాక్ గోల్డ్’ చిత్ర బృందాలు ఆమె కొత్త ప్రచార చిత్రాలు విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపాయి.

# కొత్త సినీ యుగానికి శ్రీకారం శ్రీమద్భాగవతం



సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ భారతీయ సినిమా ప్రపంచంలో ఒక నూతన శకానికి శ్రీకారం చుడుతోంది. ఒకప్పుడు ‘రామాయణ్’, ‘శ్రీ కృష్ణ’ వంటి అజరామరమైన దృశ్య కావ్యాలతో కోట్లాది మంది భారతీయుల ఇళ్లల్లో, హృదయాల్లో భక్తిపరవశాన్ని నింపిన రామానంద్ సాగర్ కుటుంబం.. ఇప్పుడు అదే ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని వెండితెరపై అత్యంత వైభవంగా ఆవిష్కరించేందుకు సిద్ధమైంది. భారతీయ పురాణ చరిత్రలోనే అత్యంత విస్తృతమైన కథా సముద్రం ‘శ్రీమద్భాగవతం’. ఈ పవిత్ర గాథను కేవలం రెండు మూడేళ్ల వ్యవధిలో లేదా ఒకే సినిమాలో చూపించడం సాధ్యం కాదు. అందుకే దీనిని ఒక భారీ సినిమాటిక్ యూనివర్స్‌గా మలచి, మొత్తం ఏడు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ ఆధ్యాత్మిక మహాగాథలో తొలి అడుగుగా ‘శ్రీమద్భాగవతం: పార్ట్ వన్ – విష్ణురథ’ రూపుదిద్దుకుంటోంది. దివంగత రామానంద్ సాగర్ వారసత్వపు బాధ్యతలను ఆయన మనవళ్లు ఆకాశ్ సాగర్ చోప్రా, అమృత్ సాగర్ తమ భుజస్కంధాలపై వేసుకున్నారు. ‘1971’ చిత్రంతో జాతీయ చలనచిత్ర పురస్కారాన్ని అందుకున్న అమృత్ సాగర్, అనుభవజ్ఞుడైన ఆకాశ్ సాగర్‌తో కలసి ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. పాత తరం భావోద్వేగాలను, భక్తి శ్రద్ధలను కాపాడుతూనే.. నేటి తరం ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఆధునిక సినిమాటిక్ శైలిలో ఈ కథను మలుస్తున్నారు. హైదరాబాద్‌లోని ప్రసిద్ధ రామోజీ ఫిల్మ్ సిటీలో వైభవంగా ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ కోసం అత్యంత భారీ సెట్లు, అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాచీన పౌరాణిక ప్రపంచాన్ని విజువల్ వండర్‌గా మార్చేందుకు అంతర్జాతీయ సాంకేతిక నిపుణులు భాగస్వాములవుతున్నారు.

# రివ్యూలతో సినిమాను పడగొట్టండి చూద్దాం..

## ‘స్పిరిట్’ నిర్మాత సవాల్

రివ్యూలతో సినిమాల స్థాయిని తగ్గించలేరని నిర్మాత ప్రణయ్ రెడ్డి అన్నారు. ఆయన నిర్మించిన ‘రోమాంచకం’ ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఈ సినిమాపై వచ్చిన విమర్శల గురించి మాట్లాడిన ప్రణయ్.. ఒక ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం వెనక ఎంతో మంది కష్టం ఉంటుందని తెలిపారు. తాను నిర్మాతగా వ్యవహరిస్తోన్న అప్‌కమింగ్ చిత్రం ‘స్పిరిట్’ గురించి ఆయన ఓ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. “నిర్మాణ రంగంలో ఉన్నవారికే.. ఆ కష్టాలు తెలుస్తాయి. రైటర్ రాసిన కథను తెరపైకి తీసుకురావడానికి దర్శకుడు ఎంత కష్టపడతాడో, షూటింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తుతాయో అందరికీ అర్థం కావు. ‘రోమాంచకం’ సినిమా రివ్యూ విషయంలో కొందరు కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్లు వ్యవహరించారు. వారికి నిజంగా అంత సామర్థ్యం ఉంటే.. రాబోయే ‘స్పిరిట్’ స్థాయిని తగ్గించగలరా?” అని ప్రణయ్ సవాల్ విసిరారు. హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న ‘స్పిరిట్’ విడుదలకు ముందే వార్తల్లో నిలుస్తోంది. మొదట ఈ సినిమాకు దీపికను ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం దర్శకుడు సందీప్ ఆమెతో ఏడాదిన్నర వర్క్ చేశారు. ఆ తర్వాత దీపిక స్థానంలోకి త్రిప్తి దిమ్రీని తీసుకున్నారు. ఆ సమయంలో దీపిక ఈ కథను లీక్ చేశారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారి తీశాయి. ప్రభాస్ హీరోగా సందీప్ వంగా రూపొందిస్తోన్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల కానున్న విషయం తెలిసిందే



Edited,Printed, Published and Owned by DHANDYALA RAVI KUMAR, Printed at Gayathri Printers - ID : PRESS/2025/125/00007278, Address : Plot no: 69 to 75, 4th Line, IDA, Khanapuram, Khammam - 507002.Telangana. EDITOR: DHANDYALA RAVI KUMAR. RNI NO: APTEL/2008/26868. Ph: 9848156178, mail: organ.today@gmail.com , website : www.organnews.in